

TGTEL/25/A2394

# ప్రజాక్షేత్రం

PRAJA KSHETRAM

ప్రతీ క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 02 | సంచిక: 335 | హైదరాబాద్ | బుధవారం | 13-05-2026 | పేజీలు: 08


# ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత



ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కలెక్టర్లపై వేటు తప్పదు

ధాన్యం, మొక్కజొన్న సేకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమీక్ష

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలిగితే కఠిన చర్యలు

లారీలు పంపని కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశం

అవసరమైతే రైతు బజార్లు, ఫంక్షన్ హాళ్లను ధాన్యం నిల్వకు వాడుకోవాలి

అకాల వర్షా ల నుంచి పంటను కాపాడేందుకు టార్పాలిన్ల పంపిణీ

సరిహద్దు రాష్ట్రాల ధాన్యం తెలంగాణకు రాకుండా కట్టుదిట్టమైన నిఘా

ధాన్యం లోడింగ్ పూర్తికాగానే రైతులకు తక్షణ రశీదుల జారీ

ఈ నెలాఖరులోగా సేకరణ ప్రక్రియను ముగించాలని మంత్రుల సూచన

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం సేకరణ మరియు మొక్కజొన్న కొనుగోళ్ల ప్రక్రియపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యుద్ధం ప్రకటించారు. క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులపై తీవ్రంగా స్పందించిన ఆయన, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు ఉన్నతాధికారులతో

..మిగతా 2లో

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

వచ్చే ఐదు రోజులు జాగ్రత్త

ఎండలపై వాతావరణ శాఖ కీలక ప్రకటన

తెలంగాణలో మళ్లీ ప్రతాపం చూపుతున్న భానుడు

వచ్చే ఐదు రోజులు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం

ప్రజలను బెంబేలెత్తిస్తున్న ఉక్కపోత.. 40 డిగ్రీలు గరిష్ట ఉష్ణోగ్రతలు

ఎండ తీవ్రత దృష్ట్యా రాష్ట్రంలో 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేసిన అధికారులు

ద్రోణి ప్రభావం తగ్గడంతో మళ్లీ పొడి వాతావరణం.. వేడిగాలుల తీవ్రత

మే చివరి వరకు తగ్గని ఎండలు.. మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని సూచన

అకాల వర్షా లు, ఎండల మధ్య నలిగిపోతున్న రైతన్న

తేమ గాలులు మాయం.. సోమవారం నుంచి పెరిగిన ఎండల తీవ్రత



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు నిప్పులు చెరుగుతున్నాయి. గత నెల రోజులుగా భానుడి భగభగలకు జనం అల్లాడిపోతుండగా, ఇప్పుడు ఎండల తీవ్రత మరింత పెరగనుందన్న వార్త ప్రజలను కలవరపెడుతోంది. రాబోయే ఐదు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, ఎండలు తీవ్రంగా ఉంటాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇప్పటికే అనేక

..మిగతా 2లో

## నీట్ రద్దు.. విద్యార్థులకు శాపంగా ఎన్డీఏ వైఫల్యం

"23 లక్షల మందికి మానసిక క్షోభ"..

విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం

పరీక్ష రద్దు

కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్

2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్



03

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

పోక్సో కేసుపై బెయిల్ పిటిషన్

అరెస్ట్ చేసేందుకు పోలీసుల వేట

మే 14న వెకేషన్ బెంచ్ విచారణ

ప్రస్తుతం పరారీలో ఉన్న భగీరథ్

ముమ్మరంగా గాలిస్తున్న పోలీసులు

కేసు విచారణకు ప్రత్యేక బృందం ఏర్పాటు

కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో దర్యాప్తు

బాలిక కుటుంబం సంచలన ఆరోపణలు

ఎదురుదాడి చేస్తున్న భగీరథ్ వర్గం

విచారణలో జాప్యంపై అధికారులను నిలదీసిన సీఎం

బాలిక తల్లిదండ్రులు వేధిస్తున్నారని కరీంనగర్‌లో కేసు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ చుట్టూ పోక్సో కేసు ఉచ్చు బిగుస్తోంది. ఓ మైనర్ బాలికను వేధిస్తున్నారనే ఆరోపణలతో నమోదైన ఈ కేసు ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లోనూ, న్యాయ వర్గాల్లోనూ పెను సంచలనంగా మారింది. పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన పోక్సో కేసులో అరెస్టు కాకుండా తప్పించుకునేందుకు భగీరథ్ తాజాగా తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం కోర్టుకు వేసవి సెలవులు ఉన్నందున, తనకు మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన వెకేషన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై మే 14వ తేదీన విచారణ జరిగే అవకాశం ఉందని సమాచారం. అయితే, పోలీసులు మాత్రం నిందితుడు భగీరథ్ ప్రస్తుతం పరారీలో ఉన్నారని, అతడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయని స్పష్టం చేశారు. బాధితురాలి తల్లిదండ్రులు

..మిగతా 2లో

# నీట్ 2026 పరీక్ష రద్దు

విద్యార్థుల భవితవ్యం కోసం కేంద్రం సంచలన నిర్ణయం

నీట్ యూజీ 2026 పరీక్షను పూర్తిగా రద్దు చేసిన కేంద్ర ప్రభుత్వం

ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో ఎన్టీఏ కఠిన నిర్ణయం

మే 3వ తేదీన ముగిసిన పరీక్ష.. త్వరలోనే రీ-ఎగ్జామ్ తేదీల ప్రకటన

కేసును సీబీఐకి అప్పగిస్తూ కేంద్ర ప్రభుత్వం సంచలన ఉత్తర్వులు

రాజస్థాన్‌లో బయటపడ్డ లీకేజీ డొంక.. వాట్సాప్‌లో హల్చల్ చేసిన పేపర్

విద్యార్థులకు ఊరటగా పరీక్ష ఫీజు రీఫండ్ మరియు ఉచిత రీ-ఎగ్జామ్

22.79 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంపై నీలినీడలు.. ఎన్టీఏ భరోసా

కోచింగ్ సెంటర్ల పాత్రపై పోలీసుల ఆరా.. పలువురు అనుమానితుల అరెస్ట్



**నేషనల్‌బ్యూరో (ప్రజాక్షేత్రం):**

దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల కల అయిన వైద్య విద్య ప్రవేశాల ప్రక్రియలో పెను ప్రకంపనలు రేగాయి. మే 3వ తేదీన నిర్వహించిన నీట్ యూజీ2026 ప్రవేశ పరీక్షలో భారీ అక్రమాలు, ప్రశ్నాపత్రం లీకేజీ జరిగినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో కేంద్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన

..మిగతా 2లో

## సనాతన ధర్మంపై ఉదయనిధి వివాదాస్పద వ్యాఖ్యలు

తమిళనాడు అసెంబ్లీ వేదికగా మళ్లీ రాజకీయ రచ్చ

సనాతన ధర్మంపై పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన

ప్రతిపక్ష నేతగా తొలి ప్రసంగంలోనే ఘాటు వ్యాఖ్యలు

తమిళ రాష్ట్ర గీతానికి ప్రథమ స్థానం ఇవ్వాల్సిందేనని అల్టిమేటం

విజయ్ ప్రమాణ స్వీకారంలో ప్రోటోకాల్ తప్పిదాలపై నిలదీత



02

# టీఆర్ఎస్ అధినేత కవితకు కోర్టు సమన్లు

కామారెడ్డి రైల్ రోకో కేసులో కవితకు కోర్టు సమన్లు

రేపు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు హాజరు కావాలని ఆదేశం

బీసీ రిజర్వేషన్ల డిమాండ్‌తో నిర్వహించిన ఆందోళన

రైళ్ల రాకపోకలకు అంతరాయం.. 12 మందిపై కేసులు నమోదు



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సేన) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు రైల్వే కోర్టు నుండి సమన్లు జారీ అయ్యాయి. గతంలో కామారెడ్డిలో నిర్వహించిన రైల్ రోకోకు సంబంధించి నమోదైన కేసు విచారణలో భాగంగా, రేపు ఉదయం 10:30 గంటలకు సికింద్రాబాద్ రైల్వే కోర్టుకు

..మిగతా 2లో

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

మొదటి విడత ఇండ్ల నిర్మాణం పురోగతిలో ఉండగా సెకండ్ ఫేజ్‌కు ప్రభుత్వం సిద్ధం

రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష

సీఎం రేవంత్ రెడ్డి సూచనల మేరకు ఇందిరమ్మ ఇండ్ల పథకం విస్తరణ

హౌసింగ్, రెవెన్యూ అధికారులతో మంత్రి పొంగులేటి కీలక సమావేశం

ఇండ్ల నిర్మాణ వేగవంతానికి ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోందని మంత్రి వెల్లడి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం రెండో విడతను రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాడు లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మొదటి విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొలిక్కి వచ్చిన నేపథ్యంలో సీఎం ఎ. రేవంత్ రెడ్డి సూచన మేరకు జూన్ 2 వ తేదీన ఆదిలాబాద్ జిల్లాలో సెకండ్ ఫేజ్ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలపై ఈ నెల 21 వ తేదీన జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి

..మిగతా 2లో

# నిప్పుల కొలిమిలా తెలంగాణ

**మొదటిపేజీ తరువాయి**

జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల మార్కును దాటేశాయి. దీనికి తోడు విపరీతమైన ఉక్కపోత తోడవ్వడంతో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడిపోతున్నారు. వాతావరణ కేంద్రం అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల చివరి వరకు ఎండల తీవ్రత ఇలాగే కొనసాగే అవకాశం ఉంది. ఎండల నుంచి ఎప్పుడు ఉపశమనం దొరుకుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్న సామాన్యులకు వాతావరణ శాఖ తాజా ప్రకటన షాక్ ఇచ్చినట్లయింది. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని నిపుణులు సూచిస్తున్నారు.

గత కొద్ది రోజులుగా అక్కడక్కడ కురిసిన తేలికపాటి జల్లులు ప్రజలకు కొంత ఉపశమనాన్ని ఇచ్చాయి. సముద్రం నుంచి వచ్చిన తేమ గాలులు, ఆకాశంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల వరకు తగ్గి వాతావరణం కాస్త చల్లబడింది. అయితే, ఇప్పుడు ఆ వాతావరణ పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ద్రోణి ప్రభావం బలహీనపడటంతో మళ్లీ పొడి గాలులు మొదలయ్యాయని, సోమవారం నుంచే ఉష్ణోగ్రతలు యధావిధిగా పెరగడం ప్రారంభమైందని అధికారులు స్పష్టం చేశారు. గాలి మళ్ళిన దిశ (విండ్ డైరెక్షన్) మారడం వల్ల వేడి తీవ్రత పెరిగిందని, దీనివల్ల ఉష్ణోగ్రతలు మళ్లీ 40 డిగ్రీల పైకి చేరుకుంటున్నాయని తెలిపారు. ఏ ప్రాంతంలోనైనా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటిన వెంటనే అక్కడ 'ఆరెంజ్ అలర్ట్' జారీ చేస్తామని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో ఈ పరిస్థితి నెలకొందని, రాబోయే రోజుల్లో వేడిగాలుల ప్రభావం కూడా ఉండే అవకాశం ఉందని హెచ్చరించింది.

మరోవైపు, ఈ మారుతున్న వాతావరణం అన్నదాతలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. ఒకవైపు మండుతున్న ఎండలు, మరోవైపు అకస్మాత్తుగా వచ్చే అకాల వర్షాలతో రైతులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న కోతలు పూర్తయి, ఆ ధాన్యాన్ని ఆరబెట్టేందుకు రైతులు కల్లాల వద్దే పడిగాపులు కాస్తున్నారు. ఎండ తీవ్రత వల్ల ధాన్యం త్వరగా ఆరుతుందని సంతోషపడేలోపే, ఆకస్మికంగా కురుస్తున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టడం రైతులకు పెద్ద సవాలుగా మారింది. అకాల వర్షాల వల్ల ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని, తద్వారా మద్దతు ధర రాదేమోనని రైతాంగం ఆందోళన చెందుతోంది. అటు పగటిపూట నిప్పులు చెరిగే ఎండ, ఇటు సాయంత్రం వేళ అకాల వర్షాలతో వాతావరణంలో అనిశ్చితి నెలకొంది.

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్న పిల్లలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాల్లో కాంక్రీట్ భవనాల వల్ల వేడి తీవ్రత రెట్టింపుగా అనిపిస్తోంది. మే నెల చివరి వరకు ఇదే రకమైన వాతావరణం ఉంటుందని వాతావరణ శాఖ స్పష్టం చేయడంతో, అప్పటి వరకు ప్రజలు ఈ నిప్పుల కొలిమిని తట్టుకోక తప్పదు. వాతావరణంలో వచ్చే మార్పులను గమనిస్తూ ఉండాలని, ఎండ తీవ్రత దృష్ట్యా అధికారులు ఇచ్చే సూచనలను పాటించాలని ప్రభుత్వం కోరుతోంది. రాబోయే ఐదు రోజులు మాత్రం రాష్ట్రానికి అత్యంత క్లిష్టమైన రోజులుగా మారనున్నాయి.

# సనాతన ధర్మంపై ఉదయనిధి వివాదాస్పద వ్యాఖ్యలు

- **తమిళనాడు అసెంబ్లీ వేదికగా మళ్లీ రాజకీయ రచ్చ**
- **సనాతన ధర్మంపై పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన**
- **ప్రతిపక్ష నేతగా తొలి ప్రసంగంలోనే ఘాటు వ్యాఖ్యలు**
- **తమిళ రాష్ట్ర గీతానికి ప్రథమ స్థానం ఇవ్వాల్సిందేనని అల్టిమేటం**
- **విజయ్ ప్రమాణ స్వీకారంలో ప్రోటోకాల్ తప్పిదాలపై నిలదీత**

**నేషనల్‌బ్యూరో (ప్రజాక్షేత్రం):**

తమిళనాడు రాజకీయాలు మరోసారి 'సనాతన ధర్మం' చుట్టూ తిరుగుతున్నాయి. డీఎంకే యువనేత, మాజీ ఉపముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ అసెంబ్లీ వేదికగా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెను దుమారాన్ని రేపుతున్నాయి. ప్రతిపక్ష నేతగా తన తొలి ప్రసంగాన్ని వినిపిస్తూ, సనాతన ధర్మం ప్రజలను విభజిస్తోందని, దానిని కచ్చితంగా నిర్మూలించాలంటూ 2023 సెప్టెంబర్‌లో తాను చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు ఆయన మళ్ళీ కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆనాడు ఈ వ్యాఖ్యల వల్ల కోర్టు కేసులు, తీవ్ర విమర్శలు ఎదుర్కొన్నప్పటికీ, ఉదయనిధి ఏమాత్రం వెనక్కి తగ్గకుండా తన పాత వైఖరినే పునరుద్ఘాటించడం గమనార్హం. ద్రవిడ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని చాటుతూనే, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో తాము రాజీపడబోమని ఆయన తేల్చి చెప్పారు. అసెంబ్లీలో ప్రతిపక్షం ఒక నిర్మాణాత్మక శక్తిగా పనిచేయాలని, గతంలో కంటే ఇప్పుడు ప్రతిపక్షానికి బలమైన సంఖ్యాబలం ఉందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ప్రధానంగా ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని నూతన ప్రభుత్వ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో జరిగిన ప్రోటోకాల్ తప్పిదాలను ఉదయనిధి ఎండగట్టారు. తమిళ రాష్ట్ర గీతమైన 'తమిళ్ తాయ్ వాల్తు'ను కాదని, ముందుగా వందేమాతరం, జనగణమన పాడటంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తమిళనాడులో జరిగే ఏ ప్రభుత్వ కార్యక్రమంలోనైనా రాష్ట్ర గీతానికే ప్రథమ స్థానం ఉండాలని, మన హక్కులను, సంప్రదాయాలను కాపాడుకోవడంలో రాజీ పడకూడదని హితవు పలికారు. గతంలో గవర్నర్ ఆర్.ఎన్. రవి గీతాల ఆలాపనలో మార్పులు చేయడానికి ప్రయత్నిస్తే డీఎంకే ఏ విధంగా అడ్డుకుందో గుర్తు చేస్తూ, ప్రస్తుత విజయ్ ప్రభుత్వం ఇలాంటి పొరపాట్లు మళ్లీ జరగనివ్వకూడదని హెచ్చరించారు. రాష్ట్ర గీతాన్ని పక్కన పెట్టే ఏ ప్రయత్నాన్ని డీఎంకే అనుమతించదని, ప్రజల సెంటిమెంట్లతో ఆడుకోవద్దని సూచించారు.

తన ప్రసంగంలో భాగంగా ఉదయనిధి స్టాలిన్ కాస్తా చమత్కారాన్ని కూడా జోడించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్, స్పీకర్ జేసీడీ ప్రభాకర్ మరియు తాను ఒకే లొయోలా కాలేజీలో చదువుకున్నామని, అందరం పూర్వ విద్యార్థులమేనని చెప్పారు. అయితే, చదువులో క్లాస్‌మేట్స్ అయినప్పటికీ, రాజకీయాల్లో మాత్రం డీఎంకే పార్టీనే సీనియర్ బ్యాచ్ అని ఎద్దేవా చేశారు. ద్రవిడ దిగ్గజం సీఎన్ అన్నాదురై మాటలను ఉటంకిస్తూ.. ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల దిశగా సాగాలంటే ప్రతిపక్షం అనేది ఒక వాహనానికి ఉన్న బ్రేకులు లేదా ఎద్దుకు కళ్లెం లాంటిదని అభివర్ణించారు. అధికార పక్షం 'అందరికీ అన్నీ' అనే సూత్రాన్ని పాటిస్తుందో లేదో తాము నిరంతరం నిఘా ఉంచుతామని, స్పీకర్ తటస్థంగా ఉండి ప్రతిపక్షానికి తగిన అవకాశం ఇవ్వాలని కోరారు. సభలో మహిళా ఎమ్మెల్యేల సంఖ్య పెరగడం పట్ల కూడా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

మరోవైపు ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే ఆయన మళ్లీ సనాతన ధర్మంపై ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా మండిపడ్డారు. గతంలో సుప్రీంకోర్టు కూడా ఇలాంటి వ్యాఖ్యలను ద్వేషపూరిత ప్రసంగాలుగా పరిగణించిందని, అయినా ఉదయనిధిలో మార్పు రాలేదని విమర్శించారు. తమిళనాడులో డీఎంకే పరాజయం పాలైనప్పటికీ, హిందూ వ్యతిరేక ధోరణిని వీడటం లేదని, కాంగ్రెస్ వంటి మిత్రపక్షాలు కూడా దీనిని ఖండించకపోవడం దారుణమని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆరోపించారు. ఇటీవల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా, ప్రతిపక్ష కూటమి నేతలకు ఇంకా జ్ఞానోదయం కాలేదని బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సనాతన ధర్మంపై ఉదయనిధి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు జాతీయ స్థాయిలో మరోసారి రాజకీయ వేడిని పెంచాయి.

# ఏ సమస్య వచ్చినా కలెక్టర్లదే బాధ్యత

**మొదటిపేజీ తరువాయి**



కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు తెచ్చిన పంటను సకాలంలో తూకం వేయకపోవడం, గన్ని బ్యాగులు మరియు హమాలీల కొరతపై వస్తున్న ఫిర్యాదులపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్లు ఏసీ గదులకే పరిమితం కాకుండా నేరుగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో విఫలమైతే కలెక్టర్లపై కూడా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం వెనుకాడదని స్పష్టం చేయడం గమనార్హం.

ధాన్యం తరలింపులో రవాణా సౌకర్యాల కొరత లేకుండా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి రవాణా శాఖ కమిషనర్‌ను ఆదేశించారు. నిబంధనల ప్రకారం లారీలను అందుబాటులో ఉంచని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సూచించారు. గోడౌన్లలో స్థలం లేదని సాకులు చెప్పవద్దని, అవసరమైతే రైతు బజార్లు, కమ్యూనిటీ హాళ్లు, ఫంక్షన్ హాళ్లను తాత్కాలిక గిడ్డంగులుగా మార్చుకోవాలని వెసులుబాటు కల్పించారు. ధాన్యం లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేసేందుకు స్థానిక హమాలీలను వినియోగించుకోవాలని, లోడింగ్ పూర్తి కాగానే రైతులకు వెంటనే రశీదులు అందజేయాలని ఆదేశించారు. దీనివల్ల తాలు, తరుగు పేరుతో కొందరు వ్యాపారులు చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని సీఎం అభిప్రాయపడ్డారు. రైతులు తమ కష్టార్జితాన్ని దళారులకు అమ్ముకోకుండా ప్రభుత్వమే పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో, రైతులు నష్టపోకుండా ఉండేందుకు శాశ్వత పరిష్కారాల దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం తడవకుండా ఉండేందుకు సరిపడా టార్పాలిన్ కవర్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్లకు సూచించారు. వాతావరణ శాఖ ఇచ్చే హెచ్చరికలను ఎప్పటికప్పుడు రైతులకు చేరవేసేందుకు మండల స్థాయిలో ఒక ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు. రైతులు అప్రమత్తంగా ఉంటే పంట నష్టాన్ని నివారించవచ్చని చెప్పారు. మొక్కజొన్న పంట ఎక్కువగా పండే జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి, పక్కా ప్రణాళికతో సేకరణ జరపాలని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం మరియు పోలీసులు సమన్వయంతో పనిచేసి ధాన్యం సేకరణ సాఫీగా జరిగేలా చూడాలని, ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సీఎస్‌కు నివేదించాలని సూచించారు.

మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు తుమ్మల నాగేశ్వరరావు కూడా ఈ సమావేశంలో అధికారులకు పలు సూచనలు చేశారు. దేశంలో మరెక్కడా లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని, ఈ ప్రయోజనం మన రాష్ట్ర రైతులకు మాత్రమే దక్కాలని వారు స్పష్టం చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి ధాన్యం సరిహద్దులు దాటి తెలంగాణ కేంద్రాలకు రాకుండా చెక్ పోస్టుల వద్ద కట్టుదిట్టమైన నిఘా ఉంచాలని కలెక్టర్లకు తెలిపారు. స్థానిక రైతుల ప్రయోజనాలను కాపాడడమే లక్ష్యంగా ఈ నెలాఖరు నాటికి ధాన్యం సేకరణ ప్రక్రియను సంపూర్ణంగా ముగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం అన్ని రకాల ఆర్థిక సహాయం అందిస్తుందని, అధికారులు జవాబుదారీతనంతో పనిచేసి రైతుల ముఖాల్లో చిరునవ్వు చూడాలని మంత్రులు ఆకాంక్షించారు. మొత్తానికి ధాన్యం సేకరణలో జాప్యాన్ని నివారిస్తూ, అన్నదాతకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడటమే ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తోంది.

# నీట్ 2026 పరీక్ష రద్దు

**మొదటిపేజీ తరువాయి**




నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్షను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) అధికారికంగా ప్రకటించింది. పరీక్ష నిర్వహణలో పారదర్శకతను కాపాడటానికి, ప్రతిభావంతులైన విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడటానికే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పరీక్ష పవిత్రత దెబ్బతిన్నట్లు నిర్ధారణ కావడంతో, త్వరలోనే కొత్త తేదీలను ప్రకటించి మళ్లీ పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్టీఏ తెలిపింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించేందుకు కేంద్రం ఈ కేసును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)కి అప్పగించింది.

రాజస్థాన్‌లోని కోటా కేంద్రంగా ఈ ప్రశ్నాపత్రం లీకేజీ డొంక కదిలింది. అక్కడ కొన్ని కోచింగ్ సెంటర్లు విద్యార్థులకు అందించిన మెటీరియల్, అసలు పరీక్షా పత్రంలోని ప్రశ్నలతో హూబహూ పోలి ఉండటాన్ని అధికారులు గుర్తించారు. దాదాపు 600 మార్కుల విలువైన ప్రశ్నలు పరీక్షకు ముందే బయటకు వచ్చినట్లు దర్యాప్తులో తేలింది. కెమిస్ట్రీ విభాగంలో వచ్చిన 120కి పైగా ప్రశ్నలు పరీక్షకు 42 గంటల ముందే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షమైనట్లు రాజస్థాన్ అదనపు డీజీపీ విశాల్ బన్సల్ వెల్లడించారు. ఈ ప్రశ్నాపత్రాన్ని ఒక్కో విద్యార్థికి రూ. 20 వేల నుంచి రూ. 2 లక్షల వరకు విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. సికార్ మరియు కోటా ప్రాంతాల్లోని కోచింగ్ సంస్థల ప్రమేయంపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలువురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ నివేదికలు కేంద్ర విద్యాశాఖకు చేరడంతో, పరీక్ష నిర్వహణలో లోపాలు ఉన్నాయని అంగీకరిస్తూ రద్దు నిర్ణయం తీసుకున్నారు.

ఈ పరీక్ష రద్దు వల్ల దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 22.79 లక్షల మంది విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అయితే, విద్యార్థులకు ఊరటనిచ్చేలా ఎన్టీఏ కొన్ని కీలక వెసులుబాట్లు ప్రకటించింది. ఇప్పటికే చెల్లించిన పరీక్ష ఫీజును విద్యార్థులకు తిరిగి రీఫండ్ చేస్తామని, మళ్లీ నిర్వహించే పరీక్ష కోసం ఎలాంటి అదనపు రుసుము వసూలు చేయబోమని స్పష్టం చేసింది. ఎన్టీఏ తన సొంత వనరులతోనే రీఎగ్జామ్‌ను నిర్వహిస్తుందని, కొత్త అడ్మిట్ కార్డుల వివరాలను త్వరలోనే అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతామని తెలిపింది. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని, వ్యవస్థపై నమ్మకాన్ని నిలబెట్టేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఎన్టీఏ భరోసా ఇచ్చింది. సీబీఐ విచారణలో మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయని, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని ప్రభుత్వం హెచ్చరించింది.

నీట్ యూజీ2026 పరీక్షను మే 3వ తేదీన పెన్అండ్‌పేపర్ విధానంలో దేశవ్యాప్తంగా 551 నగరాలతో పాటు విదేశాల్లోని 14 నగరాల్లో నిర్వహించారు. ఎంబీబీఎస్, బీడీఎస్ వంటి కోర్సుల్లో ప్రవేశాల కోసం మొత్తం 5,400కు పైగా కేంద్రాల్లో భారీ ఏర్పాట్లు చేసినప్పటికీ, లీకేజీ కారణంగా ఆ శ్రమంతా వృథా అయింది. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఉన్నప్పటికీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అడ్డు పెట్టుకుని పేపర్ బయటకు రావడం అధికారులను విస్మయానికి గురి చేసింది. ఏదేమైనా, మరోసారి పకడ్బందీగా పరీక్ష నిర్వహించి విద్యార్థుల భవిష్యత్తును కాపాడటమే తమ తక్షణ కర్తవ్యమని విద్యాశాఖ పేర్కొంది. విద్యార్థులు తమ ప్రిపరేషన్ కొనసాగించాలని, త్వరలోనే రీఎగ్జామ్ షెడ్యూల్ విడుదల చేస్తామని అధికారులు వెల్లడించారు.

# టీఆర్ఎస్ అధినేత కవితకు కోర్టు సమన్లు

**మొదటిపేజీ తరువాయి**

హాజరు కావాలని న్యాయస్థానం ఆమెను ఆదేశించింది.

బీసీలకు చట్టసభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో కవిత ఆధ్వర్యంలో గతంలో కామారెడ్డిలో భారీ ఎత్తున రైల్ రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ బిల్లులకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో భాగంగా దేవగిరి ఎక్స్‌ప్రెస్‌తో పాటు ఒక గూడ్స్ రైలును నిలిపివేయడంతో నిజామాబాద్-హైదరాబాద్ రూట్‌లో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రైల్వే ఏఎస్ఐ రవీంద్రబాబు ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు ఈ కేసును నమోదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా రైల్వే ట్రాక్‌పై నిరసనలు తెలపడం, రైళ్లను నిలిపివేసి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించినందుకు గానూ



కవితతో పాటు మరో 12 మంది నాయకులపై రైల్వే చట్టం (Railway Act) 147, 74(a) సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ ఇప్పుడు తుది దశకు చేరుకోవడంతో కోర్టు సమన్లు జారీ చేసింది.

# హైకోర్టును ఆశ్రయించిన బండి భగీరథ్

**మొదటిపేజీ తరువాయి**

ఇచ్చినఫిర్యాదుమేరకుపోలీసులుపోక్సోచట్టంలోని సెక్షన్11,12తోపాటుబీఎన్ఎస్74,75సెక్షన్లకింద కేసునమోదుచేసిదర్యాప్తునుముమ్మరంచేశారు.

ఈ కేసు విచారణలో జాప్యం జరగకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను కఠినంగా ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌తో సమావేశమైన సీఎం, ఈ నెల 8వ తేదీనే ఫిర్యాదు అందినప్పటికీ చర్యలు తీసుకోవడంలో ఎందుకు ఆలస్యమైందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల వల్ల కొంత జాప్యం జరిగిందని డీజీపీ వివరణ ఇవ్వగా, వెంటనే ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సీఎం ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ నేతృత్వంలో ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ప్రభుత్వం నియమించింది. సోమవారం నాడు డీసీపీ రితిరాజ్ పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి కేసు డైరీని పరిశీలించారు. నిందితుడు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆమె మీడియాకు వెల్లడించారు. భగీరథ్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని, త్వరలోనే అతడిని అరెస్టు చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

మరోవైపు ఈ కేసు కొత్త మలుపులు తిరుగుతోంది. తనపై వచ్చిన ఆరోపణలను బండి భగీరథ్ తీవ్రంగా ఖండిస్తున్నారు. సదరు బాలిక కుటుంబం కేవలం డబ్బుల కోసమే తనను బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఈ మేరకు భగీరథ్ తరఫున కరీంనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, అక్కడ బాలిక తల్లిదండ్రులపై కూడా పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా రెండు చోట్ల కేసులు నమోదు కావడంతో ఈ వ్యవహారం మరింత ముదిరింది. ఒకవైపు బాలిక కుటుంబం తమ కుమార్తెకు అన్యాయం జరిగిందని వాపోతుంటే, మరోవైపు ఇదంతా రాజకీయ కుట్రలో భాగమని బండి సంజయ్ అనుచరులు విమర్శిస్తున్నారు. ఏది ఏమైనా, హైకోర్టులో జరగబోయే విచారణ మరియు పోలీసుల తదుపరి చర్యలపై అందరి దృష్టి నెలకొంది. చట్టపరమైన చిక్కుల నుంచి భగీరథ్ బయటపడతారా లేక పోలీసులు అరెస్టు చేస్తారా అనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

# జూన్ 2న ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. రెవెన్యూ, హౌసింగ్ అంశాలపై జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా మంగళవారం నాడు హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు చెందిన ఇన్‌ఛార్జి మంత్రులు, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, సైబరాబాద్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ల కమీషనర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారులతో మంత్రి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.

**ప్రతిపాదనలు సిద్ధం చేయండి:**

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం దూరదృష్టి లేకుండా హైదరాబాద్ నగరానికి దూరంగా డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించడం వల్ల జరిగిన నష్టం కళ్లముందే కనిపిస్తున్నదని అటువంటి తప్పు పునరావృత్తం కాకుండా పేదలు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు 5 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లను నిర్మించే విధంగా నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని స్థలాలను గుర్తించి తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆనాటి ప్రభుత్వం నగరానికి 20 నుంచి 30 కిలోమీటర్ల దూరంలో 2బిహెచ్‌కె ఇండ్లను నిర్మించి హైదరాబాద్ నగరంలో నివసిస్తున్న వారికి కేటాయించడం వల్ల తమ జీవనోపాధికి ఇబ్బంది కలుగుతుందన్న ఉద్దేశ్యంతో ఇండ్లు తీసుకున్న లబ్ధిదారులు అక్కడ నివసించడానికి సంసిద్ధతం వ్యక్తం చేయడం లేదని క్షేత్ర స్థాయి పరిశీలనల్లో స్పష్టమైందన్నారు. ఈ అంశాన్ని ప్రధానంగా దృష్టిలో ఉంచుకుని ఏ నియోజకవర్గానికి సంబంధించి ఆ నియోజకవర్గంలోనే ప్రభుత్వ స్థలాలు, మురికివాడలు, భూదాన్, గతంలో వివిధ పథకాల కింద నిర్మించిన ఇళ్లు శిధిలావస్థలో ఉన్న ప్రాంతాలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఈ విషయంలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని అధికారులను ఆదేశించారు.

**ఆ ఇండ్లపై స్పెషల్ డ్రైవ్**

2 బిహెచ్‌కె ఇండ్లకు లబ్ధిదారులను కేటాయించడానికి యుద్ధప్రాతిపదికన స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని పొంగులేటి అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పూర్తి అయిన వాటికి, వివిధ నిర్మాణ దశల్లో ఉన్న వాటికి ఈ నెలాఖరు కల్లా లబ్ధిదారులను గుర్తించాలని, అది కూడా ఆ కాలనీలకు అయిదు నుంచి ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న వారినే ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే నిర్మాణాలన్నీ పూర్తైన ఇండ్లలో లబ్ధిదారులు ఉండేలా చూసేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కాలనీల్లో మంచినీరు, డ్రైనేజి, విద్యుత్ వంటి కనీస సౌకర్యాల కల్పనకు వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ పరిధిలో ఇండ్ల స్థలాలు ఉండి అర్హులైన లబ్ధిదారులకు ఈనెల చివరిలోగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను అందజేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరక్టర్లు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలని, పనితీరు మెరుగుపడాలని అన్నారు. పీడీలు తమ పరిధిలో గతంలో నిర్మించిన జెఎన్ఎన్ యుఆర్ఎం, రాజీవ్ గృహకల్ప, వాంబే హౌసింగ్ కాలనీలన్నిటిని సందర్శించాలని స్పష్టంగా నిర్దేశించారు.

**అంగుళం అన్యాక్రాంతమైనా సహించేది లేదు:**

అంగుళం ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైనా కఠినంగా వ్యవహరిస్తామని మంత్రి పొంగులేటి గారు హెచ్చరించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో యుఎల్‌సి భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా కొంత భాగాన్ని రిజిస్ట్రేషన్ చేశారని, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకుని రాగా వెంటనే సంబంధిత సబ్ రిజిస్ట్రార్ పై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. శాశ్వత భవనాలు లేని ఆర్డీవో, తహశీల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం సిద్దంగా ఉందని ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. రెవెన్యూ, ఫారెస్టు సరిహద్దు వివాదాలకు ముగింపు పలికేలా రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



## భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి వేడుకలు

**కుషాయిగూడ, మే 12(ప్రజా క్షేత్రం):**
కాప్రా సర్కిల్ పరిధిలోని కుషాయిగూడ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కుందన్‌పల్లి నర్సింహా-బాలమణి దంపతులు ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారికి తమలపాకులతో అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, ఈఓ వీరేశం, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

**నాగారం,మే 22(ప్రజా క్షేత్రం):**
ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ సత్యనారాయణ కాలనీలోని శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, 108 హనుమాన్ చాలీసా పారాయణాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో అలంకరించి భక్తుల చేత వడమాల సమర్పణ చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## లయన్స్ సేవాదళ్ క్లబ్ ప్రారంభం

**ఈసీఐఎల్, మే 12(ప్రజా క్షేత్రం):**
సమాజ సేవ లక్ష్యంగా "లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సేవాదళ్" నూతన క్లబ్ ఏర్పాటు, ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం సోమవారం కమలానగర్‌లోని కాపు భవన్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320సీ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె. ఇన్నా రెడ్డి, ఎండీ320 ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ కె. హరీష్ రెడ్డి, డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ కల్లెం కృష్ణారెడ్డి, ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డా. మండా సురేష్ కుమార్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ జి. శేఖర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన క్లబ్‌ను అధికారికంగా ప్రారంభించి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సమాజ సేవా కార్యక్రమాల్లో ప్రతి సభ్యుడు చురుకుగా పాల్గొని ప్రజలకు చేరువ కావాలని అతిథులు సూచించారు. కార్యక్రమంలో రవి కుమార్ యాదవ్, సంపత్ గౌడ్, ఏవీఆర్ దత్తు, శ్యాంసుందర్, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.




## హనుమాన్ జయంతి సందర్భంగా ఘనంగా వేడుకలు

**చిగురుమామిడి, మే 12(ప్రజాక్షేత్రం):**
మండలం లోని ఇందుర్తి హనుమాన్ దేవాలయం లో హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు గుజ్జ కిరణ్ శర్మ అయ్యగారి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామివారికి ప్రత్యేక అర్చనలు, హారతులు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే గ్రామ వీధులలో హనుమాన్ స్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. భక్తులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు. గ్రామ ప్రజలు, యువకులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.



# నీట్ రద్దు.. విద్యార్థులకు శాపంగా ఎన్డీఏ వైఫల్యం

- "23 లక్షల మందికి మానసిక క్షోభ"..
- విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడుతోందని ఆగ్రహం
- పరీక్ష రద్దు కేంద్రం వైఫల్యమన్న కేటీఆర్
- 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందన్న కేటీఆర్

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**
వైద్య విద్య జాతీయ అర్హత పరీక్ష (నీట్‌యూజీ) 2026 పరీక్ష రద్దుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. లక్షలాదిమంది విద్యార్థుల జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ధ్వజమెత్తారు. ప్రశ్నాపత్రం లీకేజీ కారణంగా పరీక్ష రద్దు పరిస్థితి రావడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని అన్నారు. ఇది కేంద్రానికి సిగ్గుచేటు అన్నారు.
ఎన్డీయే వైఫల్యం విద్యార్థులకు శాపంగా మారిందని అన్నారు. ఏకంగా వందకు పైగా ప్రశ్నలు పరీక్షకు ముందు రోజే లీక్ అయ్యాయని ఆరోపించారు. కష్టపడి చదివిన విద్యార్థుల జీవితాలతో కేంద్రం చెలగాటమాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2024లో కూడా ప్రశ్నాపత్రం లీకైందని గుర్తు చేశారు. ఎన్డీయే ప్రభుత్వం వైఫల్యం వల్లే మరోసారి అలాంటి పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు.
నీట్ పేపర్ లీకేజీ, పరీక్ష రద్దుపై తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజీతో లక్షలాది మంది విద్యార్థులు మానసిక వేదనకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. నీట్ పరీక్ష లీకేజీతో ప్రతి దశలో మోసాలు కనబడుతున్నాయని విమర్శించారు. నీట్ పరీక్ష వ్యవస్థే పెద్ద కుంభకోణమని, ప్రతి సంవత్సరం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని అన్నారు. ప్లస్ టూ పరీక్షల్లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్ సీట్లు కేటాయించే పాత విధానం తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేశారు.



# నన్ను కెలికారు...

- కన్న పేగును క్షోభ పెడుతున్నారు
- నా కుటుంబానికి పెట్టిన నిప్పంటించారు
- ఆ నిప్పు వాళ్లనే దహించి వేయబోతోంది
- తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు
- తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే
- కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం
- కరీంనగర్ ''హిందూ ఏక్తా యాత్ర''లో కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- బండి సంజయ్ హిందూ ధర్మ పరిరక్షకుడు
- సంజయ్ కు అండగా నిలవాలంటూ హిందువులకు హంపి పీఠాధిపతి పిలుపు
- ఏక్తా యాత్రకు జన ప్రభంజనం
- కరీంనగర్ కాషాయ మయం
- జన సంద్రమైన కరీంనగర్ వీధులు
- కాషాయ శ్రేణుల జోష్... హిందుత్వ వాదుల నినాదాలతో ముందుకు సాగుతున్న ఏక్తా యాత్ర
- వినూత్న రీతిలో కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న హిందూ ఏక్తా యాత్ర

**కరీంనగర్, మే 12(ప్రజాక్షేత్రం):**
ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. నిజానిజాలు కోర్టులు తేలుస్తాయి. తప్పు చేసినట్లు తేలితే శిక్ష అనుభవించాల్సిందే. చట్టం ముందు అందరూ సమానమే. కోర్టు నిర్ణయమే నాకు శిరోధార్యం. చట్టానికి కట్టుబడి ఉన్నా* అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ''సమాజమే నా కుటుంబమని భావించి జీవితమంతా సమాజం కోసమే పని చేసిన. ఏ ఇంట్లో కష్టమొచ్చినా పెద్ద కొడుకునై అండగా ఉన్నా. కానీ కొడుకుకు టైమివ్వలేకపోయా. జరుగుతున్న పరిణామాలకు తప్పు నాదే. క్షమించండి'' అని తెలంగాణ సమాజానికి విజ్ఞప్తి చేశారు. జీవితాంతం నా బాటలోనే నడిచిన నా భార్య కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా చేతనైనంత సాయం చేసిందని, ఈరోజు కన్న పేగునే క్షోభకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా తాను భయపడేది లేదని స్పష్టం చేసిన బండి సంజయ్ ''నన్ను కెలికారు. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతోనే అవినీతి, కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహించి వేస్తా. అవినీతి గడీలను బద్దలు కొడతా''అని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో ఈరోజు సాయంత్రం కరీంనగర్ లోని వైశ్యాభవన్ నుండి ''హిందూ ఏక్తా యాత్ర'' ప్రారంభమైంది. హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి ఏక్తా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వేలాది మంది ఈ యాత్రకు తరలివచ్చారు. వేలాది మంది కాషాయ శ్రేణులతో కరీంనగర్ జన సంద్రమైంది. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి బండి సంజయ్ ఉద్వేగ భరిత ప్రసంగం చేశారు. ఆయన ప్రసంగంలోని ముఖ్యాంశాలు...
ఈ లైట్ల ఫోకస్ ఎక్కువైంది. నేను మాట్లాడుతుంటే లైట్ల కాంతికి కళ్లల్లో నీళ్లు వస్తే ఏడుస్తున్నానని అనుకునేరు. నేను భయపడ. బండి సంజయ్ కంట తడి పెట్టే రకంకాదు. టవర్ సర్కిల్ పై కాషాయ జెండాను ఎగరేశాం. కరీంనగర్ ప్రజలకు హ్యాట్సాఫ్. హిందువుల ఐక్యతను చాటేందుకే 16 ఏళ్లుగా హిందూ ఏక్తా యాత్ర చేస్తున్నా. జై శ్రీరాం అనే నినాదమే హిందూ ధర్మాన్ని కాపాడుతుంది. హిందూ సమాజానికి ఆపదొస్తే జై శ్రీరాం నినాదంతో తెగించి కొట్లాడతాం.
కరీంనగర్ గడ్డ రక్తం నాలో ప్రవహిస్తుంది.





కరీంనగర్ లో గల్లీగల్లీలో ప్రజా సమస్యలపై కొట్లాడిన. చిన్న కార్యకర్తగా మొదలైంది నా ప్రస్తానం. నా జీవితం కష్టాలు, బాధలే. బాధలను చూసి భయపడి పారిపోయేటోడ్ని కాను.
మీరే నా కుటుంబం. సమాజమే నా ఇల్లు అనుకున్న. హార్ట్ లో స్టంట్ ఉన్నా హార్ట్ ఫుల్ గా 1600 కి.మీలు నడిచిన. తెలంగాణ ప్రజల కష్టాలను పంచుకున్న. నాటి పాలకులు నాపై రాళ్ల దాడి చేసినా, 109 కేసులు పెట్టి జైలుకు పంపినా భయపడలే. ఏ హిందువుకు ఆపదొచ్చినా అండగా ఉన్నా. మీ ఇంట్లో పెద్ద కొడుకునైన. నా టైమంతా సమాజానికే ఇచ్చిన. నా కొడుకుకు టైమియ్యలేకపోయిన. నా కొడుకును క్రిమినల్ గా చూపే ప్రయత్నం చేస్తున్నారు. నేను ఏ తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు. అయినా నా కొడుకును నేను సమర్థించడం లేదు. చట్టాన్ని, న్యాయాన్ని గౌరవిస్తా. కోర్టు నిర్ణయాన్ని శిరసావహిస్తాం. చట్ట ప్రకారం చర్యలు తీసుకోవచ్చు.
నా భార్య సైతం నన్ను ఫాలో అవుతోంది. నేనున్నా లేకున్నా కార్యకర్తలకు చేతనైనంత సాయం చేస్తోంది. ఈరోజు నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతి వ్యవస్థను దగ్ధం చేస్తా. అవినీతి, కుట్రలు చేసే గడీల బద్దలు కొడతా. నన్ను, నా కుటుంబాన్ని, నా కార్యకర్తలను ఇబ్బంది పెట్టినోడిని విడిచి పెట్టే ప్రసక్తే లేదు. బండి సంజయ్ భయపడే ప్రసక్తే లేదు. కాషాయ జెండా పట్టి కష్టాలు పడుతూనే ఉన్నా. అయినా బాధపడను..ధర్మం కోసం పోరాడుతూనే ఉన్నా. నా కొడుకుకు టైమివ్వకుండా నేను తప్పు చేసిన. తప్పు నాదే.... నన్ను క్షమించండి. తప్పు చేయలేదని నా కొడుకు చెబుతున్నాడు... నిరూపించుకోవాలని చెప్పిన. నా చివరి శ్వాస వరకు హిందూ ధర్మం కోసమే పనిచేస్తా. ఇయాళ నా కొడుకుపై జరుగుతున్న దాడిని చూసి కన్న పేగు తల్లడిల్లుతోంది. నా కొడుకు సంఘటన మమ్ముల్ని ఇబ్బంది పెడుతుంటే... 29 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటుంటే ఆ కుటుంబాలు పడుతున్న క్షోభ గుర్తుకొస్తోంది. శ్రీరామ చంద్రుడికే కష్టాలు తప్పలేదు. శ్రీరామచంద్రుడే నాకు ఆదర్శం. కష్టాలు భరిస్తా. ఆనాడు రాక్షసులు ఆంజనేయస్వామికి నిప్పంటిస్తే ఏమైంది? లంకా దహనమైంది. నేను హనుమంతుడి భక్తుడిని. నా కుటుంబానికి నిప్పంటించారు. ఆ నిప్పుతో అవినీతికి పాల్పడుతూ కుట్రలు చేసే వాళ్ల సామ్రాజ్యాన్ని దహనం చేస్తా. అవినీతి గడీలను కూల్చివేస్తా. వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

## వేసవిలోనే రహదారి పనులు పూర్తి చేయాలి

- నిర్లక్ష్య గుత్తేదారులపై చర్యలు తప్పవు
- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, మే 12(ప్రజాక్షేత్రం):**



వనపర్తి నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న రహదారి నిర్మాణ పనులను ప్రస్తుత వేసవికాలంలోనే పూర్తి చేయాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులకు, గుత్తేదారులకు సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే కాంట్రాక్టర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రోడ్లు-భవనాల శాఖ వసతి గృహంలో, అనంతరం పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ పరిధిలో పంచాయతీరాజ్, రోడ్లు-భవనాల శాఖల ఆధ్వర్యంలో నిర్మాణంలో ఉన్న రహదారులు, వంతెనల పురోగతిపై పూర్తిస్థాయిలో సమీక్షించారు. గ్రామాలు, తండాలు, మండల కేంద్రాలను జిల్లా కేంద్రాలతో అనుసంధానించే ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రోడ్ల నిర్మాణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా పెద్దమందడి రహదారి నిర్మాణంలో గుత్తేదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొంతకాలంగా బిల్లుల మంజూరులో ఆలస్యం జరిగిందని, ఇకపై అటువంటి పరిస్థితి ఉండదని ఎమ్మెల్యే తెలిపారు. చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు త్వరితగతిన మంజూరు అవుతాయని పేర్కొంటూ, గుత్తేదారులు వెంటనే పనులు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో సంబంధిత శాఖల సీఈ, ఎస్ఈ, డీఈ, ఏఈలు, గుత్తేదారులు తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్త సమ్మె జయప్రదం కోరుతూ ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందజేత..

**వలిగొండ మే 12(ప్రజాక్షేత్రం):**
2006 సంవత్సరంలో తీసుకువచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగిస్తూ నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విబి జి రామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని రోజు వేతనం 600 రూపాయలు ఇవ్వాలని రెండుసార్లు ఫోటోలు తీర్చే విధానం రద్దు చేయాలని ఉపాధి హామీ పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఉపాధి హామీలో పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని కోరుతూ మంగళవారం రోజున తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వలిగొండ మండల కమిటీ ఆధ్వర్యంలో వలిగొండ మండల ఎంపీడీవో కి సమ్మె నోటీసు అందించడం జరిగింది. సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ ఈ నెల 15న చేపట్టే దేశవ్యాప్త జయప్రదంకు సహకరించాలని కోరారు. ఒకవైపు రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులను భరించాలని చెప్తున్న ఈ చట్టంలో రాష్ట్ర ప్రభుత్వం భరించకపోతే కూలీలు పనులు లేకుండా ఉండాల్సిన పరిస్థితులు వస్తాయని కేంద్ర ప్రభుత్వం వెంటనే నూతన చట్టాన్ని రద్దు చేయాలని ఆత్మ జాతీయ గ్రామీణ ఉపాధి పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దుబ్బ లింగం, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు గుంటూరు సత్తయ్య,చేగురి నగేష్ లు పాల్గొన్నారు.





## మొగిలిపాక గ్రామంలో ఘనంగా హనుమాన్ జయంతి ఉత్సవాలు

**వలిగొండ మే 12(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలోని మొగిలిపాక గ్రామంలో హనుమాన్ జయంతి పురస్కరించుకొని మొగిలిపాక గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు మామిడి సత్తిరెడ్డి పాల్గొని భక్తి, బలం, వినయం, సేవాభావానికి ప్రతీక అయిన శ్రీ ఆంజనేయ స్వామి జన్మదినోత్సవమే హనుమాన్ జయంతి. హనుమంతుడు ధైర్యానికి, నిజాయితీకి, గురుభక్తికి ఆదర్శం. ఈ పవిత్ర సందర్భంగా ప్రతి ఒక్కరూ మంచి ఆలోచనలు, సేవాభావం మరియు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరుకుంటున్నాం అని అన్నారు. "స్థానికంగా హనుమాన్ జయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆంజనేయ స్వామి ఆశీస్సులు పొందారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జడిగె బుచ్చయ్య, ముద్దసాని జయసింహ రెడ్డి, వెంకట్ రెడ్డి, జైపాల్ రెడ్డి, సుందర్ రెడ్డి, అమిరిశెట్టి శేఖర్, మరియు మహిళలు పాల్గొన్నారు.




## హెగ్డోలి గ్రామంలో సొసైటీకి తాళం వేసి రైతుల నిరసన

**పోతంగల్ మే 12(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామంలో విశాల సహకార సంఘం తెలంగాణ, సొసైటీకి తాళం వేసి రైతులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు పుప్పాల శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. తమకు అవసరం లేని నానో యూరియా లిక్విడ్, అంటగట్టుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో తీసుకున్న లిక్విడ్ మిగిలిపోయి ఉందన్నారు. మూడు సంచుల ఎరువులు తీసుకుంటే ఒక లిక్విడ్ బాటిల్ తీసుకోవాలనే కండీషన్ పెట్టడంతో రైతులు, నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ లిక్విడ్ తీసుకోవడం మూలంగా రైతులపై రూ.200 అదనపు భారం పడుతుందన్నారు. ఇప్పటికే మందుల రేట్లు పెరిగిపోయాయని పేర్కొన్నారు. 10 సంచులకు ఒకటి ఇస్తే తీసుకుంటామని తెలిపారు. స్పందించిన ఏవో రైతుల ఆరోపణలపై ఏవో నిశితను వివరణ కోరగా.. రైతులకు అనవసరంగా నానో యూరియా ఇవ్వొద్దని చెప్పామన్నారు. సొసైటీ వాళ్లను అడిగితే రైతులు లిక్విడ్ తీసుకోకుంటే స్టాక్ రిటర్న్ చేస్తామని చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో రైతులు రుక్మయ్య, అర్జున్, సురేందర్, అశోక్, ప్రవీణ్, భారత్, చందు, గణేష్, రాము, ఆంజనేయులు, వినయ్, సురేందర్ పాల్గొన్నారు.

## అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన ఎంపీ ఈటల రాజేందర్

- **బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ఈటల హామీ**
- **అగ్నిప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్**
- **బాధిత కుటుంబాల సమస్యలు తెలుసుకున్న ఎంపీ ఈటల**

**కుత్బుల్లాపూర్, మే 12(ప్రజాక్షేత్రం):**

గాజులరామారం డివిజన్ పరిధి మహాదేవపురంలో ఇటీవల చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాద ఘటన స్థలాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ సందర్శించారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, అగ్నిప్రమాదంతో నష్టపోయిన బాధిత కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులకు ధైర్యం చెబుతూ అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ నాయకులు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై సమగ్ర విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, కేకేపి బీజేపీ కాంతారావు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు బక్క శంకర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో కన్వీనర్, గాజులరామారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



# పశువుల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలి

- **పశువుల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలి**
- **- పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్**
- **రికార్డుల అప్‌డేట్, డయల్-100 ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని ఆదేశం**
- **- కర్ణాటక సరిహద్దుల నుంచి జరిగే అక్రమ పశు రవాణాను, అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘాను ఏర్పాటు చేయాలి**
- **వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,ఐపీఎస్**

**పెద్దేముల్, మే 12(ప్రజాక్షేత్రం):**



బక్రీద్ పండుగ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాపై నిరంతరం నిఘా పెట్టాలని వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐపీఎస్ అన్నారు. మంగళవారం పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి స్టేషన్ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించిన ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం ఎస్‌హెచ్‌ఓ గది, రిసెప్షన్ సెంటర్, రైటర్స్ రూమ్, లాకప్ గదులతో పాటు మహిళా, పురుషుల బ్యారక్‌లు మరియు వాష్‌రూమ్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో రిసెప్షన్ అధికారులు ఎలా ప్రవర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్న ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న రికార్డులు, ఫైళ్లను స్వయంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.రిసెప్షన్ అధికారులు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది, సెక్షన్ హెడ్ కానిస్టేబుళ్లు, మహిళా సిబ్బందితో ముఖాముఖి సమావేశమై విధుల నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా, ఐపీఎస్ మాట్లాడుతూ...... పోలీస్ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. ముఖ్యంగా 'డయల్ 100' ద్వారా వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు భరోసా కల్పించాలని ఆదేశించారు. పని ఒత్తిడికి సిబ్బంది గురికాకుండా ఎస్‌హెచ్‌ఓ సమన్వయంతో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. పెద్దేముల్ ప్రాంతం కర్ణాటక రాష్ట్ర సరిహద్దుకు సమీపంలో ఉండటంతో అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ హెచ్చరించారు. వరి అక్రమ రవాణా, బక్రీద్ సందర్భంగా కర్ణాటక సరిహద్దుల నుంచి జరిగే అక్రమ పశువుల రవాణా మరియు ఇతర అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. స్థానికంగా నమోదవుతున్న నేరాల సరళిని విశ్లేషించి ప్రజల్లో అవగాహన కల్పించడం ద్వారా నేర నియంత్రణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పెండింగ్‌లో ఉన్న దొంగతనం కేసులపై ప్రత్యేక దృష్టి సారించి,సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి నిందితులను త్వరగా గుర్తించి పట్టుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్ ఎస్ఐ ఎం.ప్రశాంత్ వర్ధన్, హెడ్ కానిస్టేబుల్ రఫీ, స్టేషన్ రైటర్ గోపి కృష్ణ, కానిస్టేబుల్ లు మురళి, నవీన్, ముంతాజ్ ఖాతూన్, స్వప్న, ఇతర పోలీసు సిబ్బంది భీమ్ రెడ్డి, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## హనుమాన్ జయంతి సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం

- **ముఖ్యఅతిథిగా శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి**
- **సుమారు 2000 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ**
- **వృద్ధాశ్రమంలో వృద్ధులకు, గిరిజన ప్రాంతాల్లో హనుమాన్ దేవాలయాల్లో అన్నప్రసాద పంపిణీ**

**బూర్గంపాడు మే 12(ప్రజాక్షేత్రం):**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపాడు మండలం, సాగరపాకలో హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం శ్రీ అంజనా ఆనియన్స్ & ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో ఉదయం హనుమాన్ చాలీసా, మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాచలం శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకులు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి పాల్గొని అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా హనుమాన్ జయంతి సందర్భంగా ఎంతో భక్తి శ్రద్ధలతో నాగరత్నం, దేవి రేఖ దంపతులు శ్రీ అంజన ఆనియన్స్ & ట్రేడర్స్ వారి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుండి హనుమాన్ దీక్ష స్వీకరించి భద్రాచల శ్రీ సీతారామచంద్ర స్వామి దివ్య దర్శనమునకు విచ్చేసిన రామ భక్తులకు, హనుమాన్ భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని, అదేవిధంగా గిరిజన ప్రాంతాల్లో నృసింహ సేవా వాహిని ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన హనుమాన్ ఆలయాలకు ఇక్కడినుండే అన్న ప్రసాదం అందించడం జరుగుతుందని, మరియు భద్రాచలం వృద్ధాశ్రమమునకు కూడా ఇక్కడి నుండే అన్న ప్రసాదం అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దాతలకు, సేవకులకు భద్రాచల సీతారామ చంద్ర స్వామి, ఆంజనేయ స్వామి అనుగ్రహం ఎల్లవేళలా ఉండాలని కోరుతున్నామన్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ సుధూర ప్రాంతాల నుండి హనుమాన్ మాల స్వీకరించి భద్రాచలం దర్శనానికి వచ్చిన మాకు ఇక్కడ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మరణించిన బిజెపి నాయకుడికి ఆర్థిక సహాయం

- **అందజేసిన ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్**

**పోతంగల్ మే 12(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని బీజేపీ కార్యకర్త శెట్టి సాయిలు తండ్రి పెద్ద సాయిలు అనారోగ్యంతో మరణించడం జరిగింది స్థానిక బీజేపీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న బాన్సువాడ బీజేపీ నాయకులు ఎన్ఆర్ఐ కోనేరు శశాంక్ తక్షణమే స్పందించి 5,000 రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగింది వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు మార్కలి ప్రకాష్ పటేల్, మాజీ వైస్ ఎంపీపీ బాలగంగాధర్ టాక్రె, బూత్ అధ్యక్షులు గోవురు రమేష్, ప్రధాన కార్యదర్శి శెట్టి గంగారాం, కోటగిరి మండల అధ్యక్షులు ఏముల నవీన్, రుద్రూర్ మండలం అధ్యక్షులు ఆలపాటి హరికృష్ణ, మరియు సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.



## సురంగల్‌లో విద్యుత్ 'ప్రజా బాట'.. క్షేత్రస్థాయిలో సమస్యల వేట!

- **14వ వార్డులో ఏఈ బానోతు హాము పర్యటన**
- **కౌన్సిలర్ శ్రీధర్ చొరవతో కదిలిన యంత్రాంగం**
- **ప్రమాదకరంగా ఉన్న 15 స్తంభాల మార్పునకు డీఈ గ్రీన్ సిగ్నల్**



**మొయినాబాద్, మే 12(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని సురంగల్ 14వ వార్డులో మంగళవారం విద్యుత్ శాఖ 'ప్రజా బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ బానోతు హాము వార్డులో పర్యటించి విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్థానిక కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ ఆహ్వానం మేరకు వార్డులోని గల్లీ గల్లీ తిరిగిన ఏఈ, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సుమారు 15 విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, అలాగే రైతుల బోరుబావులకు విద్యుత్ సరఫరా సరిగా లేక పంటలు ఎండిపోతున్నాయని కౌన్సిలర్ ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కౌన్సిలర్ శ్రీధర్ విద్యుత్ శాఖ డీఈ రమేష్ చంద్రతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల తీవ్రతను వివరించారు. దీనిపై డీఈ సానుకూలంగా స్పందిస్తూ, ఏఈ నివేదిక ఆధారంగా త్వరలోనే బడ్జెట్ కేటాయించి సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేకల రామచంద్రయ్య, ఎల్గని అశోక్ గౌడ్, సోమ వెంకటేష్, ఎల్గని సాయి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీ లో చేరిక

- **కండువా కప్పి కాంగ్రెస్ పార్టీ లోకి ఆహ్వానించినఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి**

**నలబెల్లి మే 12(ప్రజాక్షేత్రం):**

నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన ఎంపిటిసిలు వైనాల వీరస్వామి, జన్ను జెరాజ్,వీరితో శ్యామల దేవేందర్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి పార్టీలో చేరడం జరిగిందన్నారు. చేరిన వారు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు..



## ఏసీబీ వలలో గంగాధర ఇన్‌చార్జ్ ఎస్ఆర్‌వో

- **పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అక్రమాల కేసులో అరెస్ట్**

**కరీంనగర్, మే 12 (ప్రజాక్షేత్రం):**



పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వెలుగుచూసిన అక్రమాల వ్యవహారం కొత్త మలుపు తిరిగింది. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా గంగాధర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎస్ఆర్‌వోగా విధులు నిర్వహిస్తున్న మండ కిరణ్ కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు. గతంలో పెద్దపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా, అనంతరం ఇన్‌చార్జ్ ఎస్ఆర్‌వోగా పనిచేసిన సమయంలో భారీగా అక్రమ వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు ఆయనపై నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో 2025 నవంబర్ 14న ఏసీబీ అధికారులు కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సమయంలో రూ.1,06,500 నగదుకు సంబంధించిన అనుమానాస్పద లావాదేవీలు, అక్రమ వసూళ్లకు సంబంధించిన పలు ఆధారాలు లభించినట్లు తెలిసింది. అనంతరం కేసును లోతుగా దర్యాప్తు చేసిన అధికారులు, నిజామాబాద్‌లోని నివాసంలో మండ కిరణ్ కుమార్‌ను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ ఘటనతో రిజిస్ట్రేషన్ శాఖలో కొనసాగుతున్న అవినీతి వ్యవహారాలపై మరోసారి చర్చ మొదలైంది. ప్రజల నుంచి అధిక మొత్తాల్లో డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడే అధికారులపై కఠిన చర్యలు తప్పవని ఏసీబీ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అవకాశముంది.

# పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించిన బికేఆర్ ఫౌండేషన్

- ఆరోగ్య సేవలతో పాటు విద్యకు అండగా ఉంటాం:బొంగునూరి కిషోర్ రెడ్డి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం:బొంగునూరి కిషోర్ రెడ్డి
- సీఎంఆర్ హాస్పిటల్ సహకారంతో వైద్య శిబిరం

**కుత్బుల్లాపూర్, మే 12(ప్రజాక్షేత్రం):**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని డి.పోచంపల్లి శ్రీనివాస కాలనీ, గండిమైసమ్మలో బికేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 37వ ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రోటోకాల్ & కోఆర్డినేషన్ వైస్ చైర్మన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద మరియు మధ్యతరగతి ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజలకు ఆరోగ్య సేవలతో పాటు పేద విద్యార్థుల విద్యాభ్యాసానికి కూడా బికేఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. కాలనీలో ప్రజలకు ఎదురవుతున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యే వరకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి సహకరించిన సీఎంఆర్ హాస్పిటల్ వైద్య బృందం మరియు యాజమాన్యానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపి, మహేందర్ రెడ్డి, బొంగునూరి నవీన్ రెడ్డి, రాజశేఖర్ యాదవ్, కావలి గణేష్, ప్రేమ్ కుమార్, నరసింహారెడ్డి, సాధు యాదవ్, శివ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీనివాస కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



# మేడ్చల్ జిల్లా టాపర్‌కు రూ.50 వేల నగదు ప్రోత్సాహకం

- ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మాజీ కౌన్సిలర్ పురస్కారాలు
- విద్యార్థుల విజయాలతో భౌరంపేట్‌కు గుర్తింపు

**కుత్బుల్లాపూర్, మే 12(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని భౌరంపేట్ ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో మేడ్చల్ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీకి చెందిన విద్యార్థి లక్ష్మీ నారాయణను ప్రత్యేకంగా సన్మానించి రూ.50,000 నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అలాగే మండల స్థాయిలో 3వ ర్యాంక్ సాధించిన విద్యార్థికి రూ.30,000 నగదు బహుమతి ప్రదానం చేశారు. అదేవిధంగా 500కు పైగా మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున, 490కు పైగా మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున నగదు పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించడం భౌరంపేట్ ప్రాంతానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రతిభను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని, భవిష్యత్తులో కూడా విద్యార్థులకు తన వంతు సహకారం కొనసాగిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రామిరెడ్డి, నాయకులు మన్నే శేఖర్ ముదిరాజ్, మిద్దెల మల్లారెడ్డి, కటకం విరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# హనుమాన్ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రత్యేక పూజలు

**వనపర్తి, మే 12(ప్రజాక్షేత్రం):**



హనుమాన్ జయంతి సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి జిల్లా కేంద్రంలోని పలు ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతల హనుమాన్ దేవాలయం, నాగవరం ఆంజనేయస్వామి ఆలయాలను సందర్శించిన ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు చేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ కలియుగంలో శక్తి, ధైర్యం, ఆత్మస్థైర్యానికి ఆంజనేయస్వామి ప్రతీక అని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో హనుమాన్ ఆలయం ఉండటం ప్రజల్లో స్వామివారిపై ఉన్న అపారమైన భక్తి, విశ్వాసాలకు నిదర్శనమన్నారు. భక్తుల ఆహ్వానం మేరకు చింతల హనుమాన్ దేవాలయం, నాగవరం ఆంజనేయస్వామి ఆలయాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన, చింతల హనుమాన్ దేవాలయంలో శ్రీ రామలింగేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నిరంజన్ రెడ్డికి ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, కౌన్సిలర్ మురళీ సాగర్, పెద్దముక్కల రవి, బొబ్బిలి ప్రేమ్ కుమార్, వెంకటేశ్వర గౌడ్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# పర్మిషన్‌కు విరుద్ధంగా నిర్మాణం పై .. టౌన్ ప్లానింగ్ అధికారుల యాక్షన్

- పర్మిషన్‌కు విరుద్ధంగా నిర్మాణం పై ..టౌన్ ప్లానింగ్ అధికారుల యాక్షన్
- బహదూర్‌పల్లిలో అక్రమ G+5 భవనంపై కూల్చివేత చర్యలు
- టెక్ మహీంద్రా ఎదురుగా అక్రమ నిర్మాణంపై అధికారుల ఉక్కుపాదం
- కొత్త డిప్యూటీ కమిషనర్ రాకతో టౌన్ ప్లానింగ్ అలర్ట్
- దుండిగల్‌లో డెమోలిషన్ డ్రైవ్.. బిల్డర్లలో టెన్షన్
- అక్రమ కట్టడాలపై చర్యలు కొనసాగుతాయా..?

**కుత్బుల్లాపూర్, మే 12(ప్రజాక్షేత్రం):**

దుండిగల్ సర్కిల్ పరిధిలో అక్రమ నిర్మాణాలపై జీహెచ్ఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. పర్మిషన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతున్న భవనాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు వరుస చర్యలు చేపడుతూ నిర్మాణదారులకు హెచ్చరికలు జారీ చేస్తున్నారు.

**టెక్ మహీంద్రా ఎదురుగా అక్రమ నిర్మాణంపై అధికారుల ఉక్కుపాదం**

ఈ నేపథ్యంలో బహదూర్‌పల్లి ప్రాంతంలోని టెక్ మహీంద్రా ఎదురుగా అనుమతులకు విరుద్ధంగా నిర్మిస్తున్న భారీ G+5 భవనాన్ని అధికారులు లక్ష్యంగా చేసుకున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సంఘటన స్థలానికి చేరుకుని కట్టర్స్ సహాయంతో భవనంలోని స్లాబ్‌లు, గోడలను డెమోలిషన్ చేసింది. అక్రమ నిర్మాణంపై భారీ స్థాయిలో చేపట్టిన ఈ చర్య స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

**కొత్త డిప్యూటీ కమిషనర్ రాకతో టౌన్ ప్లానింగ్ విభాగం యాక్షన్ మోడ్‌లోకి**

దుండిగల్ సర్కిల్‌కు కొత్త డిప్యూటీ కమిషనర్‌గా వెంకట మణి కరణ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పర్మిషన్‌కు మించి నిర్మాణాలు చేపడితే ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమనే





సంకేతాలను అధికారులు స్పష్టం చేస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

**అక్రమ నిర్మాణాలపై నిరంతర చర్యలు ఉంటాయా..?అన్న చర్చ**

అయితే గతంలో కూడా అక్రమ నిర్మాణాలపై అప్పుడప్పుడు చర్యలు చేపట్టినా అవి కొద్ది రోజులకే పరిమితమయ్యాయని ప్రజలు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఈ డ్రైవ్ నిరంతరంగా కొనసాగుతుందా..? లేక నామ మాత్ర చర్యలకే పరిమితమవుతుందా..? అన్నది వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ డెమోలిషన్ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌తో పాటు టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



# దుండిగల్‌లో పారిశుద్ధ్య కార్యక్రమాలపై అడిషనల్ కమిషనర్ పరిశీలన

- కంపోస్టింగ్ విధానంపై నివాసితులకు శిక్షణ
- ప్రజా పాలన కార్యక్రమంలో వ్యర్థాల నిర్వహణ అవగాహన

**కుత్బుల్లాపూర్, మే 12(ప్రజాక్షేత్రం):**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ పరిధిలో చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను అడిషనల్ కమిషనర్ సిఎంసి యాదగిరి రావు పరిశీలించారు. దొమ్మర పోచంపల్లి లోని పిఎన్ఆర్ విడోస్‌లో రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు కంపోస్టు తయారీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సరైన వ్యర్థాల నిర్వహణ ద్వారా పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా కమర్షియల్ షాపులు, హోటళ్ల వద్ద తప్పనిసరిగా డస్ట్‌బిన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై “నో బిన్ - నో లైసెన్స్” విధానాన్ని అమలు చేయడంతో పాటు జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి స్వచ్ఛ ఆటోలుకు అందించాలని ప్రజలకు సూచించారు. వీధులను పరిశుభ్రంగా ఉంచడం, రోడ్ల పక్కన పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడం, చెత్త పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే రోడ్డు పక్కన ఉన్న నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను (సిఅండ్డి వ్యర్థాల) వెంటనే తరలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్ వెంకట మణి కరణ్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్ కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పి. సాత్విక్, ఎస్ఎఫ్ఏ లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మేఘారెడ్డి

**వనపర్తి, మే 12(ప్రజాక్షేత్రం):**

హనుమన్ జయంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని 9వ వార్డు లక్ష్మీనరసింహస్వామి కాలనీలో ఉన్న వీరాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పాల్గొని స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పాలాభిషేకం, దధ్యాభిషేకం, తేనాభిషేకం, చక్కెరాభిషేకం, తీర్థాభిషేకం, సింధూరాభిషేకం, పుష్పాభిషేకం తదితర విశేష సేవలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తాయి. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ గ్రామ గ్రామాన ఆంజనేయ స్వామి ఆలయాలు ప్రజలకు ఆధ్యాత్మిక కేంద్రాలుగా నిలుస్తున్నాయని అన్నారు. ఆంజనేయ స్వామి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మహేశ్వరి, మాజీ జెడ్పీటీసీ గొల్ల వెంకటయ్య, మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ, చీర్ల ఆంజనేయులు, చీర్ల జనార్ధన్, కాలనీవాసులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# పోలీస్ స్టేషన్లో దళితులకు న్యాయం జరగడంలేదని ఆరోపణలు..!

- నవ్యాంధ్ర జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరి కోట బతుకమ్మ డిమాండ్
- బోయ నరసింహులు పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేయాలి
- దళితుల బాధితులకు న్యాయం చేయాలి

**పెద్దకడబూర్ మే 12(ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రమైన పెద్ద కడుబూరు మండల పోలీస్ స్టేషన్ లో దళితులకు న్యాయం అందలేదని కదిరికోట బతుకమ్మ నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎక్కడైనా పోలీస్ స్టేషన్లు ఉన్నవి బాధితులకు న్యాయం చేయడానికేనని స్పష్టం చేశారు, పెద్ద కడుబూరు పోలీస్ స్టేషన్ మాత్రం ఎందుకు పూర్తిగా విరుద్ధం ఇక్కడ బాధితులకు న్యాయం చేయడం అన్నది అస్సలు జరగదన్నారు. ఇక్కడ బాధితుల పక్షాన కాకుండా నిందితుల పక్షాన న్యాయం జరగడం తగదు అన్నారు. బాధితులకు రక్షణగా నిలవాల్సిన ఎస్సై మారుతి నిందితులకు రక్షణ కవచంగా నిలుస్తున్నారంటే ఇక్కడ అవినీతి ఎంతగా పేరుకుపోయిందో అర్థం చేసుకోవచ్చని మండిపడ్డారు. ఎందుకు ఒక ఎస్సై మారుతి అన్యాయం చేసిన వ్యక్తి పై కేసు ఫైల్ చేయకుండా బాధితులను పిలుస్తూ రండి మీకు న్యాయం చేస్తాను అంటూ పంచాయతీ పెద్దగా వ్యవహరించడం పోలీస్ స్టేషన్లు న్యాయం చేయడానికా లేక పంచాయతీలు చేసి తీర్చడానికా అన్న సందేహం వ్యక్తం అవుతుందన్నారు. దీనిని బట్టి చూస్తే ఇక్కడ ఎస్సై పంచాయతీలలో పెద్దగా వ్యవహరిస్తున్నాడు అన్నది అక్షరాల సత్యం అన్నారు. ఎస్పీ ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోకపోతే ఈ మండలంలోని బాధితులకు ముఖ్యంగా దళితులకు న్యాయం అన్నది అందని ద్రాక్షలా మారుతుందన్నారు. వివరాల్లోకి వెళితే పెద్ద కడబూరు మండలం బాపులు దొడ్డి గ్రామంలో మాణిక్యమ్మ అనే దళిత మహిళ తన కొట్టం ముందు రెండు కొబ్బరి చెట్లను పెంచుకుందని స్పష్టం చేశారు. దళితులు అంటే చిన్న చూపు చూస్తున్న బోయ మునిగేరి నరసింహులు అనే వ్యక్తి దళితులు మా పక్కన నివసిస్తారా అని కోపంతో అహంకారంతో ఆమె పెంచుకున్న చెట్లను అతను కావాలనే నిప్పంటించి కాల్చివేశాడన్నారు. ఎందుకు కాల్చివేశావని అడిగితే నా ఇష్టం అంటూ పొగరుగా సమాధానం వచ్చాడని మండిపడ్డారు.వారికి జరిగిన నష్టానికి బాధితులు పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫోటోలు మరియు సిసి ఫుటేజ్ చూపించి న్యాయం కోసం ఆశ్రయించగా ఇక్కడి ఎస్ఐ మారుతి న్యాయం చేయకుండా నిందితుల పక్షాన నిలబడి బాధితులను దుర్భాషలాడటం వారినే బెదిరించడం పరిపాటిగా మారిపోయింది. ఎస్సై మారుతి గారు నిందితులపై కేసు ఫైల్ చేయకుండా పలుమార్లు బాధితులను పోలీస్ స్టేషన్ కు రండి మీకు న్యాయం చేస్తాను అంటూ పంచాయతీకి ఆహ్వానించడం గమనార్హం. ఎస్సై ఉన్నది కేసులు కట్టి న్యాయం చేయడానికా లేక పంచాయతీలు చేసి దౌర్జన్యంగా రాజీలు చేయటనికా అన్నది పెద్ద ప్రశ్న.బాధితులు బోయ నరసింహులు అధికారానికి దౌర్జన్యానికి భయపడి వేరొక ఊరిలో నివసించడానికి వెళ్లారు. దళితుల చెట్లను కాల్చి దళితులను భయభ్రాంతులకు గురిచేసి, వారిని గ్రామ బహిష్కరణ చేసి, మరియు దళితులకు ఆర్థిక నష్టాన్ని కలిగించిన నరసింహులు పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి కానీ ఎస్సై మారుతి వారికి నిందితుడు బోయ నరసింహులు పై ఎందుకు అంత ప్రేమ అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఎందుకు అతడిని కేసు నుండి తప్పించాలి అని అనుకుంటున్నాడో నిజం దేవుడికెరుక. ఎస్సై తమ గోడు వినడని తెలుసుకున్న బాధితులు నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు కదిరికోట బతుకమ్మను ఆశ్రయించడం జరిగింది. ఆమె బాధితులను తీసుకొని ఎస్పీ దగ్గరికి వెళ్లి న్యాయం కోసం ఆశ్రయించగా ఎస్సై మారుతి పదే పదే మరల వారిని పంచాయతీకి ఆహ్వానించడం కొసమెరుపు. దళిత నాయకురాలు బతుకమ్మ ఎస్సై మారుతి దురాగతాన్ని పత్రికాముఖంగా తెలియజేసింది. దాంతో ఆగ్రహించిన ఎస్సై నా మీద పత్రికలపై వార్తలు రాయిస్తావా నేను కేసు కట్టను నీకు దిక్కున్న చోట చెప్పుకో ఎవరికీ చెప్పకుంటావో చెప్పుకో అయినా కూడా నేను కేసు కట్టను అంటూ ఆమెతో దురుసుగా మాట్లాడడం జరిగిందని ఆరోపించారు. దళితులకు అన్యాయం జరిగినప్పుడు, వారిని గ్రామ బహిష్కరణ చేసినప్పుడు,వారికి ఆర్థిక నష్టాన్ని కలుగజేసినప్పుడు, నిందితులపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని చట్టాలు స్పష్టంగా చెబుతున్నా ఎస్ఐ మారుతి దీనిని వ్యక్తిగతంగా తీసుకుంటున్నారు. జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ స్పందించి తక్షణమే చొరవ తీసుకుని బాధితులకు న్యాయం చేయాలని దళిత నాయకులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# దుండిగల్‌లో అక్రమ భారీ షెడ్ నిర్మాణం..?

- అనుమతులు లేకుండా షెడ్ నిర్మాణం.. అధికారులు సైలెంట్..!
- చిన్న నిర్మాణాలపై కఠినం..భారీ షెడ్లపై మౌనం ఎందుకు..?
- భారీ షెడ్ నిర్మాణంపై డీసీ జోక్యం కోరిన ప్రజలు
- దుండిగల్‌లో అక్రమ భారీ షెడ్ నిర్మాణం ఎవరి అండ..?




**కుత్బుల్లాపూర్, మే 12(ప్రజాక్షేత్రం):**
దుండిగల్ సర్కిల్ పరిధిలోని దుండిగల్ చిన్న దామరచెరువు సమీపంలో భారీ షెడ్ నిర్మాణం జరుగుతుంది. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**చిన్న నిర్మాణాలపై కఠిన చర్యలు..**
**భారీ షెడ్లపై మౌనం ఎందుకు..?**
సాధారణ ప్రజలు చిన్నపాటి ఇంటి నిర్మాణం చేపట్టినా వెంటనే స్పందించే టౌన్ ప్లానింగ్ అధికారులు, భారీ స్థాయిలో జరుగుతున్న ఈ షెడ్ నిర్మాణంపై మాత్రం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతుంటే అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**అధికారులకు సమాచారం లేదా..?**
**తెలిసీ పట్టించుకోవడం లేదా..?**
దుండిగల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ, టీపీఎస్ అధికారుల దృష్టికి ఈ నిర్మాణం వెళ్లలేదా..? లేక తెలిసీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? అనే ప్రశ్నలు ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. నిర్మాణ పనులు బహిరంగంగానే కొనసాగుతున్నప్పటికీ తనిఖీలు, నోటీసులు లేకపోవడం అనుమానాలను మరింత పెంచుతోంది.

**రాజకీయ అండదండలతోనే**
**అక్రమ నిర్మాణమా..?**
ఇంతటి భారీ నిర్మాణం జరుగుతున్నా అధికారులు స్పందించకపోవడంతో రాజకీయ ఒత్తిళ్లు లేదా కొందరు అధికారుల సహకారంతోనే ఈ అక్రమ నిర్మాణం కొనసాగుతోందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చెరువు సమీప ప్రాంతాల్లో ప్రత్యేక నిబంధనలు అమలులో ఉండగా అవి పాటిస్తున్నారా లేదా అన్నదానిపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**డిప్యూటీ కమిషనర్**
**జోక్యం కోరుతున్న స్థానికులు**
ఇప్పటికైనా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ స్పందించి నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, భూవివరాలు, నిబంధనల అమలుపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## పెద్దేముల్ పెద్ద చెరువు కట్టకు మళ్లీ

- పెద్దేముల్ పెద్ద చెరువు కట్టను రైతులతో కలిసి పరిశీలించిన పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్
- గండి పడే ప్రమాదం.. వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి
- గతంలో ఒకసారి పెద్ద చెరువు కట్టకు భారీ గండి పడి వరద నీటిలో కొట్టుకుపోయిన పంట పొలాలు
- గండి పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్న పెద్దేముల్ గ్రామ ప్రజలు, రైతులు, ప్రజా ప్రతినిధులు



**పెద్దేముల్, మే 12(ప్రజాక్షేత్రం):**
వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండల పరిధిలోని పెద్దేముల్ గ్రామ శివారులోని పెద్ద చెరువు కట్ట పరిస్థితి అత్యంత ప్రమాదకరంగా మారింది.గతంలో ఒకసారి చెరువు కట్టకు పెద్ద గండి పడటంతో దిగువన ఉన్న పంట పొలాలు ఉధృతమైన వరదలో కొట్టుకుపోయి రైతులకు భారీ నష్టం వాటిల్లింది. ప్రస్తుతం పెద్ద చెరువు కట్టకు మళ్లీ అదే ప్రాంతంలో కట్ట ప్రమాదకరంగా తయారై గండి పడే అవకాశం కనిపిస్తుండటంతో పెద్దేముల్ గ్రామ రైతులు, పెద్ద చెరువు దిగువన ఉన్న పంట పొలాల యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం పెద్దేముల్ గ్రామ పంచాయతీ సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్, పలువురు గ్రామస్తులు,రైతులతో కలిసి పెద్ద చెరువు కట్టను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువు కట్ట పరిస్థితిని పరిశీలించిన అనంతరం సర్పంచ్ డివై నర్సింహులు, ఉపసర్పంచ్ డివై ప్రసాద్ మాట్లాడుతూ త్వరలో వర్షాకాలం ప్రారంభమైతే పెద్ద చెరువు కట్ట మరింత దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. గతంలో జరిగిన నష్టాలను గుర్తుచేస్తూ, ఈసారి అలాంటి పరిస్థితి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని నీటి పారుదల శాఖ అధికారులను కోరారు.భారీ వర్షాలు కురిసే లోపే యుద్ధప్రాతిపదికన చెరువు కట్టకు మరమ్మతులు చేపట్టి, చెరువుకు గండి పడకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సమస్యను అధికారులు అత్యవసరంగా పరిగణించి స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.ఈ కార్యక్రమంలో రైతులు చెట్లమీది రాంచెంద్రి, పురుషప్ప, బ్యాగరి శ్రీనివాస్, లక్ష్మణ్, వెంకటయ్య, నర్సింహులు, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు, రైతులు, పొలాల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇంటి గడపలో ఆనందం..

- లబ్ధిదారులకు మేఘన్న కానుక
- - గృహప్రవేశాలకు హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి
- దంపతులకు నూతన వస్త్రాల పంపిణీ
- పేదల సొంతింటి కల సాకారమవుతోందని వ్యాఖ్య

**వనపర్తి, మే 12(ప్రజాక్షేత్రం):**
పేదల జీవితాల్లో వెలుగులు నింపే ఇందిరమ్మ ఇళ్ల పథకం మరోసారి ఆనంద క్షణాలకు వేదికైంది. కొత్తగా నిర్మించుకున్న సొంతింట్లో అడుగుపెడుతున్న లబ్ధిదారుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి లబ్ధిదారులకు ప్రత్యేక కానుకగా నూతన వస్త్రాలు అందజేసి ఆశీర్వదించారు. పెబ్బేరు మండలంలోని కంచిరావుపల్లి గ్రామంకు చెందిన 12 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు మంగళవారం తమ కొత్త ఇండ్లలో గృహప్రవేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రతి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. కొత్త ఇంట్లోకి అడుగుపెడుతున్న దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ నూతన వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. ఎన్నో ఏళ్లుగా సొంతింటి కోసం ఎదురుచూస్తున్న నిరుపేద కుటుంబాల కలలు ఇందిరమ్మ పథకం ద్వారా నెరవేరుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబం గౌరవంగా జీవించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. గ్రామంలో గృహప్రవేశాల సందర్భంగా పండుగ వాతావరణం నెలకొంది. కొత్త ఇండ్లను రంగురంగుల తోరణాలతో అలంకరించగా, కుటుంబ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే రాకతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. తమ జీవితంలో ఇదొక మరిచిపోలేని రోజు అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.





## పెద్దకడుబూరు లో ఆకస్మికంగా స్వేచ్ఛ రథంను తనిఖీలు..!

- ఆదోనిడివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణ రెడ్డి.!

**పెద్దకడబూర్ మే 12(ప్రజాక్షేత్రం):**
పెద్దకడబూరు మండలంలో మంగళవారం ఆదోని డివిజన్ అభివృద్ధి అధికారి బాలకృష్ణా రెడ్డి సందర్శించారు. గ్రామంలో శానిటేషన్, క్యాన్సస్, ఎనుమేనేషన్, సర్వే జలధర జల హారతి పనులు సమీక్షించారు స్వేచ్ఛ రథం కార్యక్రమం అమలు, గ్రామ పారిశుద్ధ్య పరిస్థితులు మరియు స్వచ్ఛత నిర్వహణపై గ్రామ పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి ఇంటి నుండి పొడి చెత్త సేకరణ జరుగుతున్న తీరును పరిశీలించగా, ప్రజలకు ప్రభుత్వం నిర్ణయించిన ధరలపై 17 రకాల నిత్యావసర వస్తువులు అందజేస్తున్న విధానాన్ని పరిశీలించారు. స్వచ్ఛారథం గ్రామ సందర్శన సమయంలో గ్రీన్ అంబాసిడర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న తీరును పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పారిశుద్ధ్య పరిస్థితులు, రహదారుల పరిశుభ్రత, చెత్త నిర్వహణ విధానాలను తనిఖీ చేయడంతో పాటు ఎస్ డబ్ల్యూ సి పి షెడ్ పనితీరును కూడా పరిశీలించారు. పెద్దకడబూర్ సచివాలయాన్ని సందర్శించి జనగణన (క్యాన్సస్ ఇనుమేరేషన్) పురోగతిపై సమీక్ష నిర్వహించారు. మరియు ఎంపీడీవో లకు స్వచ్ఛారథం కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేడు బుధవారం నిర్వహించనున్న "స్వచ్ఛపథం" కార్యక్రమాన్ని గ్రామాలలో కొనసాగించాలని, ముఖ్యంగా గ్రామ ప్రధాన రహదారులపై ఉన్న చెత్త కుప్పలు మరియు పశువుల ఎరువు కుప్పలను పూర్తిగా తొలగించి పరిశుభ్ర వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. గ్రామ ప్రజలు కూడా స్వచ్ఛత కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని మరియు గ్రామ పరిశుభ్రత పరిరక్షణలో సహకరించాలని కోరారు.

## హనుమాన్ ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి

- చింతల హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న డీసిసి చీఫ్ శివసేన రెడ్డి

**వనపర్తి, మే 12(ప్రజాక్షేత్రం):**
బలం, ధైర్యం, భక్తికి ప్రతీక అయిన ఆంజనేయస్వామి ఆశీస్సులు జిల్లా, రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్, డిసిసి చీఫ్ శివసేన రెడ్డి ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని చింతల హనుమాన్ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన శ్రీ ఆంజనేయస్వామి జన్మదిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆంజనేయస్వామి భక్తుల ఆహ్వానం మేరకు ఇరుముడి కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, వేదమంత్రాలతో విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు, స్వాములకు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, మాజీ వైస్ చైర్మన్ బి.కృష్ణ, నందిమల్ల చంద్రమౌళి, మాజీ మండల అధ్యక్షులు రవికిరణ్, పాండు సాగర్, శివకుమార్ నాయుడు, ఆంజనేయస్వామి భక్తులు, స్వాములు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా జరిగిన శివునిపల్లి అంజన్న ఇరుముడి యాత్ర

**జనగామ మే 12(ప్రజాక్షేత్రం):**
జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలంలో శివపల్లిలో మంగళవారం రోజున జరిగిన ఆంజనేయ స్వామి ఇరుముడి విరమల అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మండలం మరియు అర్థ మండలం రోజులు అంజన్న కు సేవ చేసి మరియు ఎంతో భక్తితో పూజలు చేసి అంజన్న స్వామి శ్రీ కొండగట్టులో ఇరుముడి వీరమల మొక్కు అప్పగించారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు మరియు కన్నా స్వాములతో యాత్ర గణాంగ సాగింది అని శివునిపల్లి ప్రజలు ప్రోత్సహిస్తూ అంజన్న స్వామి నీ భక్తి తో సాగనంపారు.



## రైతుల సమస్యలు వెంటనే పరిష్కారం

**వలిగొండ మే 12(ప్రజాక్షేత్రం):**
యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో ముద్దాపురం గ్రామ సమీపంలో న్యూ బాలాజీ రైస్ మిల్ల యాజమాన్యం గత వారం రోజులుగా ధాన్యం అన్లోడ్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్న మిల్లు యాజమాన్యం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశానుసారం రైతుల సమస్యను తెలుసుకొని వెంటనే స్పందించిన జిల్లా కిసాన్ సేల్ నాయకులు బండారు నరసింహ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించి రైతులతో కలిసి మిల్లు యజమానితో మాట్లాడడం జరిగింది ఇట్టి విషయంపై మిల్లు యజమాని సానుకూలంగా స్పందించి లారీ లోడును అన్లోడ్ చేపించినారు ధాన్యం వేగంగా సేకరించాలని మిల్లు యజమాని వెంకట్ రెడ్డి చర్చలు జరిగింది. ఒకవైపు ప్రభుత్వం రైతుల ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చూడాలని చెప్తుంటే కొందరు మిల్లు యజమానులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ముందు జరిగిన ఒప్పందం ప్రకారం వడ్లు కొనుగోలు వేగవంతం చేయాలని అరూరు రైతులు, సింగిల్విండో డైరెక్టర్ ఆవుల స్వామి, వలిగొండ ఓబీసీ సెల్ అధ్యక్షులు చిలకమర్రి కనకాచారి, ఆలూరు కొండల్ రెడ్డి, రైతు నాయకులు జెక్కిడి నర్సిరెడ్డి, జంగారెడ్డి, ఎలిమినేటి సంతోష్, గొడ్డేటి అయిలయ్య, గొడ్డటి కిష్టయ్య, అర్జున్, దేవనక వీరేందర్, సీఈవో కృష్ణ, మండల మైనార్టీ నాయకులు ఎండి రహీం, వెంకటేష్, నరసింహ రైతులు పాల్గొన్నారు.



# విజయ్ కు హైకోర్టు బిగ్ షాక్!



- **ఆ ఎమ్మెల్యే ఎన్నిక చెల్లదు?**

**వికారాబాద్ బ్యూరో మే 12(ప్రజాక్షేత్రం):**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ కు ఆ రాష్ట్ర హైకోర్టు బిగ్ షాక్ ఇచ్చింది. బలపరీక్ష వేల టీవీకి ఎమ్మెల్యే ఎన్నికల చెల్లదంటూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.తమిళనాడు అసెంబ్లీలో త్వరలో జరగబోయే కీలకమైన విశ్వాస పరీక్షకు ముందే అధికార పక్షమైన తమిళగ వెట్రి కళగం పార్టీకి ఊహించని గట్టి ఎదురుదెబ్బ తగిలింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ రేపిన ఒక ఓటు వివాదంపై మద్రాస్ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. టీవీకే ఎమ్మెల్యే ఆర్. శ్రీనివాస సేతుపతి అసెంబ్లీలో జరిగే విశ్వాస పరీక్షలో పాల్గొనకుండా, ఓటు వేయకుండా మద్రాస్ హైకోర్టు ధర్మాసనం నిషేధం విధిస్తూ మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు ఆయన ఓటింగ్ ప్రక్రియకు దూరంగా ఉండాలని స్పష్టం చేసింది.

**ఒకే ఒక్క ఓటు.. కోర్టు మెట్లెక్కిన వివాదం**

ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో శివగంగ జిల్లాలోని తిరుపత్తూరు నియోజకవర్గం ఫలితం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ స్థానంలో 'దళపతి' విజయ్ నేతృత్వంలోని టీవీకే అభ్యర్థి ఆర్. శ్రీనివాస సేతుపతికి 83,365 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి, డీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి కె.ఆర్. పెరియకరుప్పన్కు 83,364 ఓట్లు వచ్చాయి. అంటే కేవలం ఒక్క ఓటు స్వల్ప తేడాతో టీవీకే అభ్యర్థి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అయితే, పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో తీవ్ర అక్రమాలు జరిగాయని, తమ నియోజకవర్గానికి చెందాల్సిన ఒక కీలకమైన పోస్టల్ బ్యాలెట్ను పొరపాటున మరో జిల్లాలోని తిరుపత్తూరుకు పంపించి, అక్కడ రిటర్నింగ్ అధికారి దానిని తిరస్కరించారని డీఎంకే నేత పెరియకరుప్పన్ ఆరోపించారు. ఒకవేళ ఆ ఓటును సక్రమంగా లెక్కించి ఉంటే ఫలితం మారిపోయేదని పేర్కొంటూ ఆయన మద్రాస్ హైకోర్టులో అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. ఓట్లను తిరిగి లెక్కించాలని (రీకౌంటింగ్), అప్పటివరకు సేతుపతి ప్రమాణ స్వీకారాన్ని నిలిపివేయాలని కోరారు. ఈ పిటిషన్పై జస్టిస్ ఎల్. విక్టోరియా గౌరి, జస్టిస్ ఎన్. సెంథిల్ కుమార్లతో కూడిన మద్రాస్ హైకోర్టు వెకేషన్ (ప్రత్యేక) బెంచ్ ఆదివారం, సోమవారం సుదీర్ఘంగా విచారణ చేపట్టింది. ఎన్నికల ప్రక్రియ ముగిసినందున కోర్టు జోక్యం చేసుకోకూడదని ప్రతివాదులు వాదించినప్పటికీ.. ఒక్క ఓటు తేడాతోనే అభ్యర్థి విజయం ఖరారైనందున, ఓటరు హక్కును కాపాడటం ముఖ్యం అని ధర్మాసనం అభిప్రాయపడింది. విశ్వాస పరీక్ష ముంచుకొస్తున్న తరుణంలో, ఈ వివాదం తేలేవరకు టీవీకే ఎమ్మెల్యే శ్రీనివాస సేతుపతి అసెంబ్లీలో ఎలాంటి ఓటు వేయడానికి వీల్లేదని కోర్టు మధ్యంతర నిషేధాజ్ఞలు విధించింది. దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశిస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది. మరో రెండు వారాల్లో 717 వైన్ షాపుల మూసివేత వంటి సంచలన నిర్ణయాలతో దూసుకుపోతున్న సీఎం విజయ్ ప్రభుత్వానికి ఈ కోర్టు తీర్పు కొంత ఆందోళన కలిగించే అంశమే. అసెంబ్లీలో బలపరీక్షకు సిద్ధమవుతున్న తరుణంలో సొంత పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే ఓటింగ్ హక్కును కోల్పోవడం.. అది కూడా కేవలం ఒక్క ఓటు మార్జిన్తో గెలిచిన సీటు వివాదంలో పడటం తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త ఉత్కంఠకు తెరలేపింది.

## పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ



- **ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడికి మంత్రి భరోసా**
- **మాదిగలకు ప్రాధాన్యత ఇస్తాం: మంత్రి దామోదర్**

**పెద్ద కొడప్గల్, మే 12(ప్రజాక్షేత్రం):**

ఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రుసేగం భూమయ్యను వైద్యఎమ్మార్పీఎస్ కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు రుసేగం భూమయ్యను వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు. ఇటీవల భూమయ్య మాతృమూర్తి మరణించడంతో ఆ విషయం తెలుసుకున్న మంత్రి ఆయనను ప్రత్యేకంగా పిలిపించుకొని ఓదార్పు తెలిపారు. ఈ సందర్భంగా భూమయ్య కుటుంబ సభ్యుల పరిస్థితి, ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. భూమయ్య మాట్లాడుతూ.. మాదిగల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వాల్లోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ తగిన భరోసా లభించలేదని మంత్రికి వివరించారు. కుటుంబ పరిస్థితులు కూడా ఆశించినంతగా లేవని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎల్లప్పుడూ బలహీన వర్గాల పక్షాన నిలుస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా భూమయ్య కుటుంబానికి అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే భవిష్యత్తులో కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగ సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని భూమయ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాదిగలకు విద్య, ఉపాధి, గృహాలు, ఆర్థిక సహాయం వంటి సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి.. అన్ని వర్గాలతో పాటు మాదిగ సామాజిక వర్గ అభివృద్ధికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి నిధుల కేటాయింపులో మాదిగలకు ప్రాధాన్యత కల్పించి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భూమయ్య చేస్తున్న సామాజిక సేవలను అభినందిస్తూ, సమాజ హక్కుల కోసం చేస్తున్న పోరాటం కొనసాగించాలని మంత్రి సూచించారు. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పరామర్శించారు.

ఇటీవల భూమయ్య మాతృమూర్తి మరణించడంతో ఆ విషయం తెలుసుకున్న మంత్రి ఆయనను ప్రత్యేకంగా పిలిపించుకొని ఓదార్పు తెలిపారు. ఈ సందర్భంగా భూమయ్య కుటుంబ సభ్యుల పరిస్థితి, ఆర్థిక ఇబ్బందులను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. భూమయ్య మాట్లాడుతూ.. మాదిగల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ గత ప్రభుత్వాల్లోనూ, ప్రస్తుత ప్రభుత్వంలోనూ తగిన భరోసా లభించలేదని మంత్రికి వివరించారు. కుటుంబ పరిస్థితులు కూడా ఆశించినంతగా లేవని, ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.దీనిపై స్పందించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఎల్లప్పుడూ బలహీన వర్గాల పక్షాన నిలుస్తుందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా భూమయ్య కుటుంబానికి అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే భవిష్యత్తులో కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న మాదిగ సామాజిక వర్గానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని భూమయ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మాదిగలకు విద్య, ఉపాధి, గృహాలు, ఆర్థిక సహాయం వంటి సంక్షేమ పథకాలు మరింత విస్తృతంగా అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి స్పందించిన మంత్రి.. అన్ని వర్గాలతో పాటు మాదిగ సామాజిక వర్గ అభివృద్ధికి కూడా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి నిధుల కేటాయింపులో మాదిగలకు ప్రాధాన్యత కల్పించి అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. భూమయ్య చేస్తున్న సామాజిక సేవలను అభినందిస్తూ, సమాజ హక్కుల కోసం చేస్తున్న పోరాటం కొనసాగించాలని మంత్రి సూచించారు.

## పోక్సో కేసులో బండి సాయి భగీరథ నువెంటనే అరెస్ట్ చేయాలి

- **బాధిత కుటుంబానికి రక్షణ కల్పించాలని డిమాండ్**
- **బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదు**
- **రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతిబీమ్ భరత్**

**శంకర్పల్లి మే 12(ప్రజాక్షేత్రం):**

పోక్సో కేసులో బిజెపి కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ పై 17 సంవత్సరాల అమ్మాయి పై లైంగిక వేధింపుల కేసులో కేసు నమోదు అయిన మూడు రోజులు గడిచినా ఇప్పటి వరకు నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం పట్ల రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతిభీమ్ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె మాట్లాడుతూ మూడు రాజులుగా బాధిత కుటుంబం న్యాయం కోసం తిరుగుతున్నా పోలీసులు కేసును పట్టించుకోలేదని ఆరోపించారు. బాధితురాలి కుటుంబాన్ని రాజకీయ ప్రభావంతో బెదిరింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చట్టం ముందు అందరూ సమానమైతే, పోక్సో వంటి తీవ్రమైన కేసులో ఆలస్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. బాధిత కుటుంబానికి పూర్తి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాజకీయ సంబంధాలు, ఒత్తిళ్లు కారణంగా కేసు దర్యాప్తు ఆలస్యం అవుతోందనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. పిల్లల భద్రతకు సంబంధించిన కేసుల్లో రాజీ పడకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే ప్రజలు ఉద్యమాలకు సిద్ధమవుతారని శ్రీజ్యోతిభీమ్ భరత్ హెచ్చరించారు.





## వనపర్తిలో కాంగ్రెస్‌కు శాశ్వత చిరునామా!

- **రాజపేట శివారులో జిల్లా కార్యాలయానికి స్థల పరిశీలన..**
- **త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా శంకుస్థాపన**
- **జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శివసేన రెడ్డి వెల్లడి**

**వనపర్తి, మే 12(ప్రజాక్షేత్రం):**

జిల్లాకాంగ్రెస్ పార్టీకి శాశ్వత కార్యాలయ నిర్మాణం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. పార్టీ కార్యకర్తలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా, ఆధునిక సౌకర్యాలతో కూడిన జిల్లా కార్యాలయ భవన నిర్మాణానికి కాంగ్రెస్ నేతలు కసరత్తు ప్రారంభించారు. ఈ మేరకు మంగళవారం రాజపేట శివారులోని 73 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు పరిశీలించారు. వనపర్తి డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో పార్టీకి శాశ్వత జిల్లా కార్యాలయ భవనాన్ని నిర్మించేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి జిల్లా కార్యాలయం కీలక కేంద్రంగా మారబోతుందని పేర్కొన్నారు. కార్యకర్తలు, ప్రజలు సులభంగా చేరుకునే విధంగా ప్రశాంత వాతావరణంలో కార్యాలయాన్ని నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. స్థల పరిశీలన పూర్తైన వెంటనే నిర్మాణ పనులపై కార్యాచరణ రూపొందించి, వేగంగా ముందుకు తీసుకెళ్లాలని నిర్మాణ కమిటీకి సూచించినట్లు చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ సమక్షంలో త్వరలోనే కార్యాలయ శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించే అవకాశముందని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సాయి చరణ్ రెడ్డి, అధికార ప్రతినిధులు కోళ్ల వెంకటేష్, గంధం శరవందతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ సర్వేయర్లు పాల్గొన్నారు.

## మహేష్‌నగర్‌లో పేకాట స్థావరంపై దాడి

- **11 మంది అరెస్ట్.. రూ.1.03 లక్షల నగదు స్వాధీనం**

**కుషాయిగూడ, మే 12 (ప్రజా క్షేత్రం):**

కాప్రా సర్కిల్ పరిధిలోని డా.ఏఎస్‌రావు నగర్ డివిజన్ మహేష్‌నగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై కుషాయిగూడ పోలీసులు మంగళవారం ఆకస్మిక దాడి నిర్వహించారు. పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందంతో కలిసి భవాని టవర్స్‌లోని ఫ్లాట్ నెం.1లో ఉన్న జీపీ టెక్ సొల్యూషన్స్ కార్యాలయంపై పోలీసులు రైడ్ చేపట్టారు. ఈ సందర్భంగా అక్కడ 11 మంది వ్యక్తులు డబ్బులు పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్నట్లు గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి 11 సెల్‌ఫోన్లు, 9 సెట్ల ప్లేయింగ్ కార్డులు, రూ.1,03,480 నగదును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. ఈ ఘటనపై కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నగరంలో అక్రమ జూద కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇలాంటి వ్యవహారాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.






## ఉపాధి హామీ కూలీల ఆరోగ్యానికి పెద్దపీట

**పెద్దేముల్, మే 12(ప్రజాక్షేత్రం):**

వేసవి ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి హామీ కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు, ఉప సర్పంచ్ డివై ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప, కారోబార్ నర్సిరెడ్డి లు మంగళవారం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు.ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలు ఎండల ప్రభావానికి గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. శరీరంలో నీరసం రాకుండా తరచూ నీరు తాగుతూ ఓఆర్ఎస్ వినియోగించాలని తెలిపారు. అనంతరం కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఉపాధి హామీ పనులకు సంబంధించిన ఇబ్బందులు,తాగునీరు, వసతులు తదితర అంశాలపై కార్మికులు వివరించగా,సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు .ఈ సందర్భంగా పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై నర్సింహులు,ఉప సర్పంచ్ డివై ప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్పలు మాట్లాడుతూ.. వేసవి కాలంలో ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఎండల్లో పని చేస్తున్నారని, వారి ఆరోగ్య రక్షణ కోసం ఓఆర్ఎస్ పాకెట్ల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు.కూలీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చర్యలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఉపాధి హామీ కూలీలు కూడా పని సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయాల్లో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కారోబార్ నర్సిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ బోయిని వెంకటయ్య, ఆశా వర్కర్ లు మల్లీశ్వరి, పుష్ప,ఉపాధి హామీ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు,తదితరులు పాల్గొన్నారు.



## విద్యా వారోత్సవాల్లో భాగంగా రెండో రోజు పోటీ పరీక్షలపై అవగాహన, జాబ్ మేళా!

- **ఆమనగల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి**

**ఆమనగల్ మే 12(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రభుత్వ ప్రణాలిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా కళాశాల విద్యాశాఖ మే 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విద్యా వారోత్సవాలు నిర్వహిస్తుంది కావున కళాశాల విద్యాశాఖ అదేశాలననుసరించి ఈ రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆమనగల్లో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శ్రీపాద శర్వాణి అధ్యక్షతన రెండవ రోజు పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఈ రోజు కళాశాలలో జాబ్ మేళా కూడా నిర్వహించారు. మంగళవారం నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి 32 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థిని విద్యార్థులు, నిరుద్యోగులు పాల్గొన్నారు.



# మంత్రుల శాఖలో మార్పులు...?

- పనితీరుపై సీఎం వద్ద రిపోర్ట్ కార్డు.....
- మంత్రుల తీరుపై సీఎం అసంతృప్తి....!

రాష్ట్ర ప్రభుత్వ పనితీరు గురించి క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారు? మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపైనా సీఎం రేవంత్ నిఘా వర్గాల ద్వారా నివేదికలు తెప్పించుకుంటున్నట్టు తెలుస్తోంది.కిందిస్థాయిలో పథకాలు అందుతున్నాయా? ప్రజలు సంతోషంగా ఉన్నారా? రుణమాఫీ, రైతుభరోసా, పంట బోనస్ విషయంలో రైతులు సంతృప్తిగా ఉన్నారో లేదో అని ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నట్టు సమాచారం. ప్రభుత్వానికి మైలేజ్ తీసుకురావడం కోసం, ఎన్నికల్లో పార్టీ సత్తా చాటేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రులను నియమించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ గత ఎన్నికల్లో కొందరు మంత్రుల పనితీరు బాగుందని నివేదికలు అందగా.. మరికొందరు సీఎం ఆశించిన స్థాయిలో పనితీరు కనబరచడం లేదని తెలిసింది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి ఆరు నెలలకు ఒకసారి మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నట్టు తెలుస్తుండగా.. అందులో కొందరు పనితీరు మెరుగవ్వగా.. మరికొందరు మాత్రం ఏ మాత్రం పనితీరు కనబరచడం లేదని సీఎం రేవంత్ గుర్తించినట్టు సమాచారం. త్వరలోనే వారిపై చర్యలు తీసుకునేందుకు సీఎం సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే పలుమార్లు హెచ్చరించిన సీఎం.. కేబినెట్ విస్తరణ, ప్రక్షాళన సమయంలో పనితీరు సరిగా కనబరచని వారికి ఉద్వాసన పలుకుతారని ప్రచారం జరుగుతోంది. మిగతా ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టికెట్ నిరాకరించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. ఇదే విషయమై పార్టీలోని కొందరికి హింట్ సైతం ఇచ్చినట్టు సమాచారం.

రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పథకాలు, కార్యక్రమాలు చేపట్టినా మైలేజ్ రావడం లేదని అధిష్టానం గుర్తించింది. ఓవైపు ప్రభుత్వానికి పెద్దగా ఆదాయం లేకపోయినా అప్పులు తెచ్చి మరీ సీఎం రేవంత్ సంక్షేమం అమలు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు నానా తంటాలు పడుతున్నారు. ఆరు గ్యారెంటీల్లో మహిళలకు రూ.2500 మినహా అన్నింటినీ సర్కారు అమలు చేసినా క్షేత్రస్థాయిలో ప్రభుత్వం మీద వ్యతిరేకత పెరుగుతోందని తెలుస్తోంది. ప్రభుత్వ కార్యక్రమాలు, పథకాలు, సంక్షేమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మంత్రులు, జిల్లా ఇన్‌చార్జులు ఫెయిల్ అయ్యారని ప్రచారం జరుగుతోంది.అందుకే రాష్ట్ర మంత్రులపై సీఎం రేవంత్ వసంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

**మంత్ర శాఖలో మార్పులు...**

తెలంగాణ మంత్రుల శాఖల మార్పు అంశం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఎవరి శాఖ ఉంటుంది? ఎవరికి ఏ కొత్త బాధ్యత దక్కుతుంది? అనేది సస్పెన్స్ గా మారింది. గత కొద్ది రోజులుగా వినిపిస్తున్న 'మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ' వార్తలు సచివాలయ వర్గాల్లోనూ, రాజకీయ వర్గాల్లోనూ సెగలు పుట్టిస్తున్నాయి. అగ్రనాయకత్వం నుంచి వచ్చిన కొన్ని లీకులు ఇప్పుడు మంత్రులలో కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ప్రభుత్వ పనితీరును మరింత వేగవంతం చేయడానికి, క్షేత్రస్థాయిలో పాలనను పరుగులు పెట్టించడానికి కొన్ని కీలక శాఖలను మార్చక తప్పదని హైకమాండ్ భావిస్తోంది. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల విషయంలో సమూల మార్పులు జరిగే అవకాశం ఉందని సమాచారం. కొందరు మంత్రుల పనితీరుపై అసంతృప్తితో ఉన్న అధిష్టానం, వారికి ప్రాధాన్యత లేని శాఖలను కేటాయించి, యాక్టివ్‌గా ఉన్న వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని చూస్తోంది. దీంతోనే ఇప్పుడు మంత్రులకు షఫ్లింగ్ టెన్షన్ మొదలైంది. సహజంగా కాంగ్రెస్ పార్టీలో హై కమాండ్ ఆదేశాలను తూచా తప్పక పాటించాల్సిన పరిస్థితులు నెలకుంటాయి. ఈ నేపథ్యంలో ఏ శాఖ ఎవరికి కేటాయిస్తారోనని సీనియర్ మంత్రులతో పాటు ఇటీవల కొత్తగా బాధ్యతలు తీసుకున్న మంత్రుల్లోనూ టెన్షన్ నెలకొంది.

**రెండున్నర ఏళ్లయినా.. కొలిక్కి రాని క్యాబినెట్..**

ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు గడుస్తున్నా, ఇప్పటికీ 'ఫుల్ క్యాబినెట్' అన్న ముచ్చట తీరలేదు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం లేదా అదనపు బాధ్యతలుగా ఉండటంతో పాలనపై ప్రభావం పడుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే ఖాళీగా ఉన్న మంత్రి పదవులను భర్తీ చేస్తారా? పాత వారికి ఉద్వాసన పలికి కొత్త వారికి ఛాన్స్ ఇస్తారా? కేవలం శాఖలను మాత్రమే అటు ఇటు మారుస్తారా? అనే ప్రశ్నలు ఉత్కంఠను పెంచుతున్నాయి. ఇప్పటికే కొందరు సీనియర్ మంత్రులు తమకు అప్పగించిన శాఖలను ఎట్టి పరిస్థితుల్లో మార్చవద్దని సీఎంకు చెప్పినట్లు సమాచారం. గతంలో తమ కేటాయించిన శాఖల పనితీరును మెరుగుపరిచేందుకు రెండున్నర ఏళ్లపాటు శ్రమించామని, మళ్లీ కొత్త శాఖల అప్పగించడం వల్ల మొదటి నుంచి టాస్క్‌ను మొదలు పెట్టాల్సి ఉంటుందని కొందరు సీనియర్ మంత్రులు సీఎంకు వివరించినట్లు తెలిసింది. ఇలాంటి పరిస్థితుల్లో హై కమాండ్ ఆదేశాలు ఏ విధంగా ఉంటాయోనని అందరిలోనూ ఆసక్తి నెలకొన్నది.

**మంత్రుల్లో మొదలైన వణుకు.**

తమ శాఖలు ఎక్కడ మారిపోతాయోనని కొందరు మంత్రులు భయపడుతుంటే, మరి కొందరు మాత్రం తమకు ప్రస్తుతం ఉన్న శాఖ కంటే మెరుగైన శాఖ దక్కుతుందని ఆశగా ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా కీలకమైన హామీల అమలులో వెనుకబడిన శాఖల మంత్రులకు షఫ్లింగ్ ముప్పు పొంచి ఉందని తెలుస్తోంది. వాస్తవానికి పాలనలో వేగం పెంచాలంటే మార్పు అనివార్యం. ఇలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అభిప్రాయాలు, లీడర్ల మనోభావాలు, క్షేత్రస్థాయి కార్యకర్తల ఫీడ్ బ్యాక్, పొలిటికల్ ఈక్వేషన్స్, క్యాస్ట్ ఈక్వేషన్స్ వంటివి క్రోడీకరిస్తూ ఏఐసిసి తీసుకునే నిర్ణయం పై ప్రభుత్వం పై ప్రజలు ఓ అభిప్రాయానికి వచ్చే ఛాన్స్ ఉన్నది.



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్ట్
7901503777



# హరిగోశ పడుతున్న రైతులు

- హరిగోశ పడుతున్న రైతులు
- రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- ధాన్యాన్ని వెంటనే తరలించాలి
- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి

**కౌడిపల్లి ప్రజాక్షేత్రం :-**

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను కష్టాలపాలు చేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత రెడ్డి అన్నారు మంగళవారం మండల కేంద్రమైన కౌడిపల్లి లోని జాతీయ రహదారిపై రైతులతో కలిసి ధర్నా రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి నెల గడుస్తున్న తూకం వేయడం లేదని రైతులను కష్టాలపాలు చేస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటినుండి రైతులను హరిగోశ పెడుతుందని రైతులకు రైతుబంధు వేయడం లేదని పెట్టుబడులేక రైతులు కష్టాల పాలవుతున్నారని అంతేకాకుండా కరెంటు కోతలు విధిస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారని ప్రభుత్వం పై ధ్వజమెత్తారు ధాన్యాన్ని వెంటనే తూకం వేసి ధాన్యాన్ని తరలించాలని ధాన్యం కేంద్రాల వద్ద సంచులు,హమాలీలు లేరని ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పించాలని వారు అన్నారు ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు సారా రామ గౌడ్, ఉత్తమ రైతు మహిపాల్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ దుర్గారెడ్డి, సర్పంచులు కుమార్, పట్లోళ్ల శ్రీనివాస్, కుమార్, బాకీ సుమలత, నాయకులు కాంతారావు, రాజు, పోలా నవీన్, బొద్దు నవీన్ గుప్తా, కుమ్మరి సతీష్, రైతులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.






# బియ్యం వ్యాపారులే...... రేషన్ డీలర్!

- రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో బియ్యం అక్రమాలు.
- రేషన్ డీలర్లు బియ్యం వ్యాపారులుగా మారిన ఆరోపణలు.
- పేదలకు ఇవ్వాల్సిన బియ్యం పక్కదారి.
- అవసరం లేని కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు కిలో రూ 15, చెల్లింపు.
- అదే బియ్యాన్ని బయట మార్కెట్లో 22 రూపాయలకు విక్రయం.
- ప్రభుత్వ సంక్షేమ పథకాల దుర్వినియోగం.
- పట్టుబడిన డీలర్ల కె . మళ్లీ షాపులు అప్పగింత
- చర్యలు లేకపోవడం వల్ల అక్రమంగా తరలింపు.

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 12(ప్రజాక్షేత్రం):**

రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో కొందరు రేషన్ డీలర్లు ఇదే సమయంగా భావించిన కొందరు డీలర్లు బియ్యం అవసరం లేని లబ్ధిదారుల నుండి 15 రూపాయల కిలో చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యం బయట వ్యాపారులకు సొమ్ము చేసుకుంటున్నారు. షాబాద్ మండలంలోని వివిధ రేషన్ షాప్ డీలర్ల పై గతంలో పదుల సంఖ్యలో కేసులు నమోదైన ఒక్కటైనా నిరుపన కాకపోవడంతో మళ్లీ పట్టుబడిన డీలర్ల కే షాపులు అప్పగిస్తున్నారు, ఫలితంగా వారు యదేచ్ఛగా దండ కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం పక్కదారి పడుతుంది. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు ఎంతో ఆర్థిక భారాన్ని భరిస్తూ అందజేస్తున్న సన్నబియ్యం పక్క దారి పడుతున్న అడ్డుకోవడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దొడ్డు బియ్యం మొదలు సన్న బియ్యం వరకు గ్రామాల్లో యధావిధిగా అక్రమాలు జరుగుతున్నాయి. ఒకవేళ రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ ప్రతిసారి వ్యాపారులు డీలర్ పైన6(ఏ) కింద కేసు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. షాబాద్ మండలంలోని ఆయా గ్రామాల్లో రేషన్ షాపుల డీలర్ల పై గతంలో పదుల సంఖ్యలో 6(ఏ) నమోదైన ఒక్కటి నిర్ధారణ కాకపోవడంతో మళ్లీ పట్టుబడిన రే షన్ డీలర్ల కే షాపులు అప్పగిస్తున్నారు. రేషన్ బియ్యం పట్టుకున్న సమయంలో అధికారులు నిర్వహించే పంచనామా లోపా,భూయిష్టంగా ఉండడంతో కేసులు జరగకుండా పోతున్నాయని ఆరోపణలు వెలివెత్తుతున్నాయి. ప్రజలు ఫిర్యాదు చేస్తేనే తప్ప అధికారులు షాపులను తనిఖీ చేసే పరిస్థితి లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. షాపులను నిరంతరం తనిఖీ చేయాల్సిన సంబంధితశాఖ అధికారులు చుట్టపు చూపుగా ఇలా వచ్చి అలా వెళ్ళిపోతుంటారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు, తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు ప్రతినెల ఒక్కొక్కరికి 6 కేజీల సన్నబియ్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది, అధికారులు డీలర్లు అవినీతి కారణంగా ఈ పథకం అవాసుల పాలవుతుంది, ప్రభుత్వం గతంలో దొడ్డు బియ్యం సరఫరా చేసినప్పుడు బయటినుంచి వ్యాపారులు వచ్చి రేషన్ వినియోగదారుల వద్ద కేజీ 5 రూపాయలకు కొనుగోలు చేసే వారు, గత ఏడాది ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండడంతో వ్యాపారం దందాగా మారింది, ఏకంగా డీలర్రే బియ్యం వ్యాపారుల అవతార మెత్తి కార్డుదారుల వద్ద బియ్యం కొనుగోలు చేస్తుండడం విశేషం, గ్రామాల్లో కొంతమందికి బియ్యం అవసరం లేకపోవడంతో తీసుకోవడం లేదు, ఇదే అనువుగా భావించిన డీలర్లు, బియ్యం అవసరం లేని కార్డుదారులకు 15 రూపాయల చొప్పున నగదు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు, ఇదే బియ్యాన్ని బయట వ్యాపారుల కు 22 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నా రనేది బహిరంగ రహస్యం మే, అధికారులు పర్యవేక్షణ కొరవడటంతో డీలర్లు తమ ఇష్టానుసారంగా విహరిస్తున్నారని రెవెన్యూ సివిల్ సప్లై అధికారులకు నెల నెల నెలమామూళ్లు ముడుతున్నాయని అక్రమాలకు గూర్చి తెలిసిన ట్టు వ్యవహరిస్తున్నార నే ఆరోపణలు ఉన్నాయి.

**మరింత నిఘా పెంచుతాం:షాబాద్ తాసిల్దార్ అన్వర్.**

రేషన్ డీలర్రే వినియోగదారుల నుంచి బియ్యం కొంటున్నారనే ఆరోపణలపై సివిల్ సప్లై అధికారుల షాపులను తనిఖీ చేస్తున్నారని తాసిల్దార్ అన్వర్ అన్నారు. అవసరమైతే మరింత నిఘా పెంచి అక్రమాలను అడ్డుకుంటామని ఆయన తెలిపారు.



# బస్సును పునరుద్ధరణ కోసం రాస్తారోకో

**రాజన్న సిరిసిల్ల జిల్లా మే 12(ప్రజాక్షేత్రం):**

ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో స్థానిక పెట్రోల్ బంకు చౌరస్తా దగ్గర గ్రామస్తులు బస్సు కోసం రాస్తారోకో నిర్వహిస్తున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య మాట్లాడుతూ మాకు గత 40 సంవత్సరాల నుండి సిరిసిల్ల డిపోకి చెందిన బస్సు సిరిసిల్ల నుండి ఇల్లంతకుంట మండల కేంద్రానికి వెళ్లేది. ప్రస్తుతం ఆర్టీసీ బస్సు సిరిసిల్ల నుండి దాచారం, బోటిమీదిపల్లె, తెనుగువారిపల్లె, సిరికొండ గ్రామాల మీదుగా వెళ్తుంది.మాకు గతంలో ఏ విధంగా బస్సు రూట్ మ్యాప్ సర్వే ప్రకారంగా వెళ్లాలని కోరుతున్నారు.ఆర్టీసీ రూట్ మ్యాప్ లో పెద్దలింగాపూర్ గ్రామ ఎస్సార్ లేదు అని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు సిరిసిల్ల డిపో మేనేజర్ ప్రకాష్ రావు తో చరవాణిలో మాట్లాడి మాకు పాత పద్ధతి ప్రకారమే సిరిసిల్ల వయా పెద్ద లింగాపూర్ మీదుగా ఇల్లంతకుంటకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరడం జరిగింది.ఇట్టి విషయంపై ఎస్.టి.ఐ అధికారి వర్జిలాల్ పెద్దలింగాపురం గ్రామానికి వచ్చి హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించడం జరిగినది.ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సర్పంచ్ గన్నేరం వసంత నర్సయ్య,ఉప సర్పంచ్ ఎల్లవేని రమేష్,మరియు ప్రజానిధులు తదితరులు పాల్గొన్నారు.



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394